# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

నవంబర్ - 2014

సంపుటి- 40 సంచిక : 11



## సంపాదక వర్గం

కె.జోజయ్య, ప్రధాన సంపాదకులు
సిహెచ్.సుభాష్‌చంద్రబోస్
ఐ.వెంకటేశ్వరరావు
పి.బాబురెడ్డి
కె.సురేష్‌కుమార్
ఎన్.కుమార్ రాజా


## ఈ సంచికలో...


| | |
|---|---|
| విశ్వంలో విద్య | -04 |
| క్లస్టర్ స్కూళ్ళా? కామన్ స్కూళ్ళా? | -05 |
| పెను ప్రమాదంలో పాఠశాలలు | -07 |
| ఉద్యోగుల ఆరోగ్య పథకం .... | -09 |
| పటిష్ట నిర్బంధ విద్య అమలే బాల.... | -11 |
| నోబెల్‌శాంతి బహుమతి విజేతలకు... | -13 |
| ఆరోగ్య పథకం నవంబర్ 1 నుండి... | -14 |
| రాజీ ప(బ)డి (కథ) | -15 |
| ప్రశ్నోత్తరాలు | -18 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | -20 |
| తిరుపతిలో విద్యా చైతన్య సదస్సు | -21 |
| రాష్ట్ర మహిళా టీచర్ల సదస్సు | -22 |
| ఉద్యమవార్తలు | - 23 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -30 |



| | | |
|---|---|---|
| దశాబ్దిచందా | : | ₹ 1000-00 |
| 5 సం॥ చందా | : | ₹ 550-00 |
| సం॥ చందా | : | ₹ 120-00 |
| విడిప్రతి | : | ₹ 10-00 |

SBI Online
A/c No. 30206957939



ఐక్య ఉపాధ్యాయ

యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి,
గవర్నర్‌పేట, విజయవాడ-520002

Ph.No. : 0866-2573763
MobileNo. : 9490300573
Website : www.aputf.org.
E-mail : ikyopadhyaya@gmail.com


# ఏ "విలువల"కీ ప్రస్థానం?

'కుంతీదేవి కర్ణుణ్ణి ప్రసవించకుండానే పుత్రుడిగా పొందింది. అంటే జన్యుశాస్త్ర పరిజ్ఞానం మనకు మహాభారత కాలంలోనే వుండేదన్న మాట'

'మనమందరం పూజించే గణేశుడు మానవ శరీరానికి ఏనుగుతలను అతికిస్తే వచ్చినవాడు. అంటే ప్లాస్టిక్ సర్జరీ మనకు ఎప్పుడో తెలుసన్నమాట'

'మహాభారతం నాటికే మనకు టెలివిజన్ వుంది. వేద యుగంలోనే మోటారు కార్లున్నాయి'

ఇవన్నీ సాక్షాత్తు భారత ప్రధానమంత్రి రిలయన్స్ ఫౌండేషన్ వైద్యశాల ప్రారంభిస్తూ చెప్పిన మాటలు! చేసిన వ్యాఖ్యలు!! ఇదో పార్శ్వం.

'మనకు స్మార్ట్ సిటీలు కావాలి. దీనికి జపాన్ సాయం కావాలి. డిజిటల్ ఇండియా మనకవసరం. దీనికి అమెరికా సహకారం కావాలి. మనకు బుల్లెట్ ట్రైన్‌లుండి తీరాలి. వీటి కోసం చైనా తోడ్పడితే బాగుండు. అన్నట్లు మన శాస్త్రవేత్తలు అంగారగ్రహానికి మార్స్‌ను విజయవంతంగా పంపారు. ఇదంతా వారి కఠోర శ్రమ ఫలితం. 'మేక్ ఇన్ ఇండియా! కోసం చేతులెత్తి ప్రపంచాన్ని ఆహ్వానిస్తునాం'. ఇది రెండో పార్శ్వం.

అన్నీ వేదాల్లో, పురాణాల్లో వుంటే మళ్ళీ వీటన్నిటికోసం ఈ దేవులాటలెందుకు? ఆ పురాణాలే తిరగేసే పనికి మన పండితులందరిన్నీ పురమాయిస్తే సరిపోతుంది గదా అంటే 'ఆ పనీ చెయ్యండ'ని సెలవిచ్చారు మన కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిగారు!

అరేబియన్ నైట్స్ కథల్లో తివాచీ మీద గగన విహారం చెయ్యడం ఎరుగుదుము. గ్రీకు పురాణాల్లో హెర్క్యులస్ భూమిని మొయ్యడం చదివాము. వీరూ మోడిలాగానే క్లైమ్ చేస్తే ఏమవుతుంది? ఈ చిన్న తర్కం మన పాలకులకు తట్టదు.

ఈ పిచ్చినంతా తలకెక్కించుకొన్న తర్వాత ఇప్పుడు దీన్ని మన పిల్లలకెక్కించాలని ప్రయత్నం ప్రారంభమైంది. ఇందుకోసం దీనానాథ్ బత్రాగారి పుస్తకాల్ని గుజరాత్‌లో 42వేల స్కూళ్ళకు సరఫరా చేశారు. బిపిన్‌చంద్ర లాంటి చరిత్రకారుల గ్రంథాల్ని తగలబెట్టమని హుంకరిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త విద్యా విధానం తెస్తున్నామనీ, సమూల సంస్కరణలు చేస్తున్నామనీ మన కేంద్ర మానవ వనరులశాఖా మంత్రిణి ప్రకటించారు. ఇందుకోసం వెతికి వెతికీ 'మేధావుల్ని', 'చరిత్రకారుల్ని' పట్టుకొచ్చి పురమాయిస్తున్నారట! ఇదంతా భారతీయ విలువల్ని కాపాడటానికట.

ప్రతి పౌరుడికీ శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం ప్రాథమిక విధి అని మన రాజ్యాంగం చెబుతుంది. రాజ్యానికి మాత్రం ఇది వర్తించదన్న మాట!

వీటినేనా విలువలంటారు! ఇవేనా మన పిల్లలకు తక్షణం నూరిపొయ్యాల్సినవి? ఇవి లేకనేనా మన జాతి వెనకబడిపోయింది? స్వచ్ఛ భారతమూ; స్వర్ణ భారతమూ వీటితోనేనా ఆవిష్కరింపబడేది?

ఆధునిక దృక్పథం లేకుండా ఆధునిక విజ్ఞానం, ఆధునిక సమాజం ఎలా అవతరిస్తాయి? చిన్న తనంలోనే 'విలువల' పేరిట మెదళ్ళను కుళ్ళబెడితే ప్రపంచాన్ని జయించే యువతరం రేపు ఎలా రూపొందుతుంది?

ఇవీ మనమిప్పుడు వెయ్యాల్సిన ప్రశ్నలు. ఎదిరించాల్సిన సవాళ్ళు. విస్తృతంగా జనంముందు పెట్టాల్సిన ధోరణలు. ముందు ఉపాధ్యాయులంగా మన దృక్పథానికి మనం పదును పెట్టుకొంటేనే ఈ యుద్ధానికి సిద్ధం కాగలం.

## ఉపాధ్యాయుల రక్షణ మరియు నాణ్యమైన విద్యకై గళమెత్తిన ఉక్రెయిన్

ఉపాధ్యాయుల వేతనాల తగ్గింపు, విద్యారంగంలో ఉద్యోగాల తగ్గింపు, పాఠశాలల మూసివేతలకు దారితీసిన కొత్త విధానాలను వివిధ ప్రాంతాల్లోని ట్రేడ్ యూనియన్లు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. అక్టోబర్ 15న పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా, ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ సైన్స్ వర్కర్స్ ఆఫ్ ఉక్రెయిన్ (ఎస్‌టిఇఎస్‌యు)కు చెందిన 850మందితో సహా ఉక్రెయిన్ ట్రేడ్ యూనియన్‌కు చెందిన సుమారు 5000 మందితో, జాతీయ మంత్రి మండలి ముందు "మంచి జీవితం కొరకు మంచి ఉద్యోగం" అని నినదిస్తూ, ర్యాలీ మరియు పికెటింగ్ నిర్వహించారు. విద్యారంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల విలువైన సేవలకు గుర్తింపుగా వారి నిజ వేతనానికి 20% అలవెన్సులను 2010 నుండి అమలు చేస్తున్నారు. కాని ఏప్రిల్ నుండి ఇట్టి అలవెన్సులను స్థానిక నిధుల నుండి చెల్లించాలనడంతో సుమారు 10.5% అలవెన్సుల తగ్గుదల ఏర్పడింది. గతంలోవలె వేతనాలను పునరుద్ధరించాలని ఎస్‌టిఇఎస్‌యు సంఘ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. వేతన తగ్గుదల వలన గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యపై చెడుప్రభావం ఉంటుందని సంఘ నాయకులు తెలిపారు.

## ఉపాధ్యాయులకు బలం చేకూర్చే లక్ష్యంతో ఇఎఫ్‌ఎ టూల్‌కిట్ ఆరంభం

ఉపాధ్యాయులకు ఉపయోగకర సలహాలను ఉపకరణాలుగా అందించే విధంగా టూల్‌కిట్‌ను, ఎడ్యుకేషన్ ఫర్ ఆల్ (ఇఎఫ్‌ఎ), గ్లోబల్ మానిటరింగ్ రిపోర్టు (జిఎంఆర్) సంయుక్తంగా నెలకొల్పి, ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఆరంభించారు. విద్యార్థులు అధికంగా ఉన్న తరగతి గదులలో బోధించడంలో ఎదుర్కొనే సవాళ్ళు, సరియైన శిక్షణ లేని కారణంగా కలిగే ప్రభావాలు అందరికంటే ఉపాధ్యాయులకే బాగా తెలుసు. నాణ్యమైన విద్య కొరకు ప్రభుత్వ శాసన కర్తలతో ఉద్యమించవలసి వచ్చినపుడు ప్రయోగాత్మకంగా చేపట్టవలసిన చర్యలకు కావలసిన వనరులను (మార్గాలను) ఈ టూల్‌కిట్ ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంచుతుంది. దీనిలో బోధన, అధ్యయనాలకు సంబంధించిన గణాంకాలు పొందుపరచబడి ఉంటాయి. ఉదా: 250 మిలియన్ల బాలలు బడిబయట ఉన్నారు. 3.3 మిలియన్ల అదనపు టీచర్లు 2030 వరకు అవసరం.

అభ్యసన సంక్షోభాన్ని అంతం చేయాలని నియామకాలు, శిక్షణ, కేటాయింపులు మరియు ఉన్న పోస్టులను నిలిపి ఉంచడం, విద్యావిధాన రూపకల్పనలో ఉపాధ్యాయులకు అవకాశం ఉండే విధంగా విధానాలను మార్పు చేయడం ద్వారా శాసనకర్తలు తప్పని సరిగా ఉపాధ్యాయులకు సహకరించాలని, "ఉపాధ్యాయులు మరియు సంఘాలు సమస్య పరిష్కారంలో అంతర్భాగం కావాలని" ఈ టూల్‌కిట్ ప్రధానంగా సూచించింది. దీనిలో కీలక సందేశాలు, ప్రపంచవ్యాప్తంగా మంచి అనుభవాలు, ఆచరణలు, అలాగే ఆచరణల ద్వారా మంచి ఫలితాలు సాధించిన ఋజువులు పొందుపరచబడి ఉంటాయి.

ఇఎఫ్‌ఎ జిఎంఆర్ ఈ టూల్‌కిట్ ప్రచురణను మెచ్చుకుంటూ ప్రపంచవ్యాప్త ఉపాధ్యాయులకు కీలక అంశాలను అందుబాటులోకి తెచ్చేవిధంగా ఆన్‌లైన్ ప్రశ్నావళిని 2015లో ఆరంభించనున్నది.

## ప్రభుత్వ కఠిన వైఖరిని వ్యతిరేకిస్తూ బ్రిటన్ ఉపాధ్యాయ సంఘాల ప్రదర్శన

బ్రిటన్‌లో అక్టోబర్ 18న 'వేతన పెంపు బ్రిటన్‌కు అవసరం' అనే బ్యానర్ క్రింద, ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (టియుసి) నిర్వహించిన ప్రదర్శనలో, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్కూల్ మాస్టర్స్ యూనియన్ ఆఫ్ టీచర్స్ (ఎన్‌యుటి)కు చెందిన సుమారు 90,000 మంది ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయులు మరియు వారి మిత్రులు, ఇతర శ్రామికుల కుటుంబాలు పాల్గొని ఉపాధ్యాయుల అవసరాలను వారి కోపాన్ని వ్యక్తం చేశారు. వేతనాలు తగ్గించడం వలన పెరిగిన పేదరికము ఇండ్లు లేకపోవడం లేదా పోగొట్టుకోవడం జరిగిన క్రమంలో, రాజకీయ నాయకులకు మరియు ప్రజలకు ఆర్థిక మరియు సామాజిక విధానాల అవగాహన పెంపొందించే లక్ష్యంతో ఈ ప్రదర్శన జరిపారు.

గత నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న వేతన కత్తిరింపుల వలన 50% ఉపాధ్యాయులు ఆహారం వంటి అత్యవసర వస్తువులకు వెచ్చించే ఖర్చును కూడా తగ్గించుకున్నారు. 30%పైగా ఉపాధ్యాయులు అప్పులు చేస్తూ జీవిస్తున్న పరిస్థితులు ఏర్పడ్డాయని సంఘ నాయకులు తెలిపారు.

## విద్యపై పెట్టుబడులు పెంచాలని కెమెరూన్ ఉపాధ్యాయుల డిమాండ్

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం 2014 "ఉపాధ్యాయులపై పెట్టుబడి భవిష్యత్తుకు పెట్టుబడి"అనే నినాదంతో నిర్వహించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రపంచీకరణ, వ్యాపారీకరణ విధానాల వలన విద్యాభివృద్ధి జరగలేదని ప్రభుత్వాలు విద్యకు మరియు ఉపాధ్యాయులకు అతి తక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాయని, వాస్తవంగా భవిష్యత్తు అభివృద్ధిని కోరితే, తప్పనిసరిగా ఇప్పుడు ఉపాధ్యాయులపై ఖర్చు చేయాలని కెమెరూన్ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.

### విద్యా ప్రమాణాల పెంపుకై కంబోడియా ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి

కంబోడియా ఇండిపెండెంట్ టీచర్స్ అసోసియేషన్ (సిఐటిఏ) మరియు ఫ్రెండ్లీ ఐలాండ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎఫ్‌ఐటిఏ) ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 'విద్యా ప్రమాణాలు పెంచాలి', 'ఆకలితో బోధన సాధ్యం కాదు' అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించి ఉపాధ్యాయుల అవసరాలు తీర్చాలని మరియు విద్యా ప్రమాణాలు పెంచాలని కోరుతూ విద్యాశాఖమంత్రికి మరియు ప్రధానమంత్రికి విజ్ఞాపన పత్రాలు సమర్పించారు.

## ఆస్ట్రేలియా ఉపాధ్యాయుల సమస్యలను వెలువరించిన రిపోర్టు

ఉపాధ్యాయుల అవసరాలు, పనిభారము, ఎక్కువ విద్యార్థులతో ఉన్న తరగతి గదులు, నేటితరం విద్యార్థులను సిద్ధం చేయడంలో వచ్చే సవాళ్ళు ఎదుర్కోవడానికి సరిపోయేంత శిక్షణ లేకపోవడం వంటి సమస్యలు ఆస్ట్రేలియా ఉపాధ్యాయులను ప్రభావితం చేస్తున్నాయని ఇటీవల స్టాఫ్ ఇన్ ఆస్ట్రేలియా స్కూల్స్ (ఎస్ఐఏఎస్) రిపోర్టు వెలువరించింది.

సిడ్నీలో ఇండిపెండెంట్ ఎడ్యుకేషన్ యూనియన్ ఆఫ్ ఆస్ట్రేలియా (ఐఇయు) అక్టోబర్ 2,3 రోజులలో జరిపిన నేషనల్ కాన్ఫరెన్స్‌లో నాణ్యమైన విద్య ఆవశ్యకతను వెలుగులోకి తెస్తూ ర్యాలీ నిర్వహించారు.

## ఉపాధ్యాయులను లెక్కచేయని 'హంగేరి' ప్రభుత్వం

విద్యా వ్యవస్థలో జోక్యం చేసుకుంటూ ఉపాధ్యాయ సంఘాల పాత్రను తగ్గిస్తూ, హంగేరి ప్రభుత్వం ఉపాధ్యాయ వృత్తిపై పట్టు సాధిస్తోంది. ప్రధానంగా సామాజిక చర్చలు లోపించడం అనేది ఉపాధ్యాయ సంఘం ఎదుర్కొంటున్న సమస్య అని, పోరాటాల సందర్భంలోనే కాక క్రమంతప్పకుండా చర్చలు, సంప్రదింపులు జరగాలని, కాని ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో సామాజిక చర్చలకు స్థానం లేదని, 2013 సం॥ విద్యా సంస్కరణలు సంప్రదింపులు లేకుండానే వెలువరించారని, ఈ సంస్కరణలలో ఉపాధ్యాయుల వేతనాలు, పని గంటలకు సంబంధించిన అంశాలు సవరించవలసి ఉన్నదని సంఘ నాయకులు తెలిపారు. 2013 సం॥ విద్యా సంస్కరణల్లో నిర్బంధ విద్య వర్తించే వయస్సు 18 సం॥ల నుండి 16 సం॥లకు తగ్గించారని, దీనివలన యువత విద్యావకాశాలు తగ్గిపోతాయని, ఉపాధ్యాయుల వృత్తిపరమైన స్వేచ్ఛ లేకుండా ఆంక్షలు విధిస్తున్నారని హంగేరి ఉపాధ్యాయ నాయకులు తెలిపారు.



వి.బాలసుబ్రహ్మణ్యం
ఎమ్మెల్సీ

# క్లస్టర్ స్కూళ్లా? కామన్ స్కూళ్లా?

మన ప్రాథమిక విద్యారంగం ప్రమాదపుటంచుల్లో వున్నదని దాదాపు అందరికీ ఏకాభిప్రాయం వుంది. దీన్ని పెద్ద ఎత్తున పునర్నిర్మాణం చేస్తే తప్ప నిలబెట్టడం కష్టమనీ చాలాకాలంగా అందరం అనుకొంటున్నాం. అయితే ఏం చెయ్యాలి? ఎవరు చేస్తారు? చెయ్యాలని మన ప్రభుత్వాలకేమైనా మనసుందా, చెయ్యమని నిలదీసే వారెవరు? ఈ ప్రశ్నలకు మాత్రం సమాధానాలు దొరకడం కనా కష్టంగా వుంది.

ఈ దశలో కొత్త ప్రభుత్వం వచ్చింది. అన్ని రంగాలపైనా చర్చా పత్రాలు విడుదల చేసింది. 'మిషన్లు' ప్రారంభించింది. శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్‌ల మేరకు ఒక చర్చకూడా జరిపింది. ప్రభుత్వం నుంచి హామీలు కూడా ఘనంగానే ఇచ్చింది. 'ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేట్‌రంగం చూచి తలదించుకొనేలా చేస్తాం' అనేది ఈ హామీల్లో కీలకమైంది. ముఖ్యమంత్రిగారు కూడా ఇదే చెప్పారు.

**క్లస్టర్ స్కూళ్ల కసరత్తు :** మనం కూడా ఇతర రాష్ట్రాల, దేశాల అనుభవాల్ని చూచి, మన క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించి చాలా రోజులుగా ఒక పరిష్కారం చెబుతున్నాము. అన్ని హంగులువున్న పెద్దపెద్ద స్కూళ్ళు, ప్రస్తుత ప్రజానీకపు డిమాండ్‌కు తగ్గ పాఠశాలలు నిర్మించాలని కోరుతున్నాము. చిన్నచిన్న నాన్ ఫార్మల్ సెంటర్‌లాంటి పాఠశాలల మనుగడ కష్టమని అనుకొంటున్నాము. పలుమార్లు పలు వేదికల నుంచి దీన్ని డిమాండ్ చేస్తున్నాము.

ఈ దశలో రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ స్కూళ్ళ కసరత్తును తెరమీదికి తెచ్చింది. ఇది కేవలం ఒక సర్వే మాత్రమేనా, ఒక ఆలోచన మాత్రమేనా లేక సీరియస్ ప్రయత్నమా అనేది చెప్పడం కష్టంగా వుంది. ఏ స్థాయిలో నూ కూర్చొని చర్చించింది లేదు. ఎవ్వరితోనూ మాట్లాడింది లేదు? విద్యాశాఖకు సైతం ఎంత అర్థమైందో అనుమానంగా వుంది. ఏమైనా ఏదో ఒకటి జరుగుతుంది. మనతో నిమిత్తం లేకుండా జరుగుతుంది.

**మంచి పాఠశాల :** ఒకమంచి ప్రాథమిక పాఠశాల ఎలావుండాలి? అనేందుకు ఎన్‌యుఇపిఎ లాంటివి కొన్ని నమూనాల్ని సూచిస్తున్నాయి. కనీసం 150మంది పిల్లలతో, అయిదు తరగతి గదులూ, ఆరుగురు టీచర్లూ (హెడ్ మాస్టర్‌తో కలిపి) వుంటే అంతోఇంతో ప్రామాణికమైన పాఠశాల అనేది ఒక నమూనా. తరగతికొక టీచరుండాలని బహుళ తరగతి బోధన మన పెద్ద లోపమనీ మనమూ అనుకుంటున్నదే. ఈ స్థాయి పాఠశాలలే పది కాలాలపాటు మనుగడ సాగిస్తాయనీ, ఆధునికవసరాలకు తగ్గట్టు కొత్త హంగులూ (కంప్యూటర్ల వంటివి), ప్రయోగాలు (కృత్యాధారబోధన) చెయ్యడానికి అనువుగా వుంటాయని అందరూ ఒప్పుకొంటారు. మన దేశంలోన కేరళ, తమిళనాడు లాంటి బలమైన ప్రాథమిక పాఠశాల వ్యవస్థవున్న రాష్ట్రాల్లో ఇది కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. రాష్ట్రంలోని మొత్తం 3451 ప్రాథమిక పాఠశాలల్లో ఇలాంటివి కేవలం 1240 మాత్రమే. అంటే 4%. ఇదే కేరళలో 93.23% స్కూళ్ళు, తమిళనాడులో 84.94% స్కూళ్ళు, చివరికి ఉత్తరప్రదేశ్‌లో కూడా 65.96% స్కూళ్ళు ఆరుగురు టీచర్లతో నడుస్తున్నాయి. మనకేమో పాఠశాలలేమో మూతపడ్డం, రేషనలైజేషన్ జరగడం, ప్రమాణాలు తీవ్రంగా పడిపోవడం ఆనవాయితీగా మారింది.

ప్రభుత్వం దీన్నంతా అర్థం చేసుకొని బలమైన ప్రాథమిక విద్యకు పునాదిగా, దీర్ఘదృష్టితో, రాష్ట్రాభివృద్ధి పట్ల ఒక సమగ్ర దృక్పథంతో క్లస్టర్ల స్కూళ్ళను ప్రారంభిస్తోందా? ఆషామాషీగాను, ప్రైవేట్‌పరం చెయ్యడానికో, ఉన్న వ్యవస్థను కూడా అతలాకులం చెయ్యడానికో పూనుకొంటుందా అనేవి తేలాల్సివుంది. మార్మికంగా, ఏకపక్షంగా, బ్యూరోక్రటిక్‌గా చేసే సంస్కరణలు అనుమానాలకు ఖచ్చితంగా దారితీస్తాయి. మన రాష్ట్ర రాజకీయ వాతావరణం గానీ, కేంద్ర విధానాలుగానీ ప్రభుత్వ వ్యవస్థల్ని పటిష్టం చేసేందుకనుకూలంగా వున్నాయని ఎవ్వరమూ నమ్మలేము.

**ద్వారకా తిరుమల నమూనా :** పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో ఒక సర్వే చేశారు. మండలంలో 7-8 ప్రాథమిక పాఠశాలలకు కేంద్రంగా లేదా ప్రత్యామ్నాయంగా వుండదగ్గ పాఠశాలను ఒకదాన్ని క్లస్టర్ స్కూలుగా ఎంపిక చేశారు. మండలానికివి 10 వచ్చాయి. ఒక్కో క్లస్టర్ స్కూల్‌కు 100-250 మధ్య పిల్లలుంటారని అంచనా వేశారు. వీరంతా ఆ క్లస్టర్ స్కూలు పరిధిలోని ప్రస్తుత పాఠశాలల పిల్లలు. వీరుగాక ప్రైవేట్ స్కూళ్ళకెళ్తున్న పిల్లల్ని కూడా లెక్కిస్తే ఎందరుంటారు. ఆ లెక్కలు కూడా తీశారు. ఒక్కో క్లస్టర్ స్కూల్‌కు తరగతి గదులేగాక గ్రంథాలయం, కంప్యూటర్ రూమ్, దృశ్యశ్రవణ బోధనకు ప్రత్యేక గది వుండేలా అవసరాల్ని గుర్తించారు.

ఇలాంటి స్కూళ్ళను గుర్తించేప్పుడు రవాణాకు అనుకూలత, మంచి స్థలం, ప్రజల తోడ్పాటు లాంటివికూడా పరిగణనలోనికి తీసుకొన్నారు. జిల్లా కలెక్టర్ గారు చొరవతీసుకోవడం అభినందనీయం. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టి సారించింది. విద్యాశాఖ రూ.3700/- కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించింది. క్లస్టర్ స్కూళ్ళకు హెడ్ మాస్టర్ పోస్టుల్ని (స్కూల్ అసిస్టెంట్ స్థాయి) మంజూరు చేసేందుకు ప్రతిపాదన సిద్ధం చేసింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇవి ప్రారంభం కావాలన్న ధోరణిలో వుంది.

ప్రభుత్వంలోని ఉన్నత వర్గాలు మాత్రం ఇదంతా ప్రాథమిక ప్రయత్నమే తప్ప ఇంకా రాజకీయ నిర్ణయం ఏమీ జరగలేదని చెబుతున్నాయి. అందరితో మాట్లాడి చేపడతామని అంటున్నాయి.

**ఇప్పుడు మనముందుకు కొన్ని ప్రశ్నలొస్తాయి....**

**ఒకటి :** క్లస్టర్ పాఠశాలగా ఒక పాఠశాలను ఎంపికచేసి కొన్ని హంగులు కల్పించి దాని చుట్టూవున్న స్కూళ్ళనన్నిటిని ఒకేసారి మూసివేస్తారా? ఇలా చేస్తే గగ్గోలయిపోదా? వేలాది స్కూళ్ళు మూసేస్తున్నారని విమర్శలు రావా?

ఇలాగాకుండా అన్ని హంగులు వున్న కొన్ని మంచి పాఠశాలల్ని ఏర్పాటు చేసి దానికి అతి దగ్గరలోని ఒకటి రెండు పాఠశాలల్ని మాత్రం

విలీనం చేసి, నడిపిస్తే మంచిది గదా? ఒక క్రమంలో క్లస్టర్ స్కూల్ ఆకర్షణీయంగా మారి రవాణా సదుపాయం కూడా కల్పిస్తే దూరపు పిల్లలు కూడా ఇందులోకి రావచ్చు. అప్పటి పరిస్థితినిబట్టి ఆలోచించ వచ్చు. ఇది ఆచరణీయంగా వుంటుంది గదా?

**రెండు :** క్లస్టర్ స్కూళ్ళు ప్రస్తుత మోడల్ స్కూళ్ళలాగా ప్రత్యేకమైనవా? లేకుంటే ఒక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల క్లస్టర్ స్కూల్‌గా మారుతుందా? అలా కొత్త స్కూలు పెడితే కొత్త టీచరు పోస్టులిస్తారా? మరి ప్రస్తుత టీచర్లను ఏం చేస్తారు. ఇలా కాకుండా కోరుకొని సవాలుగా స్వీకరిస్తామని ముందుకొచ్చిన ప్రస్తుత టీచర్లతోనే క్లస్టర్ స్కూళ్ని నడిపించవచ్చు. కొత్త సొసైటీలు కొత్త యంత్రాంగం అనవసరం గదా!

**మూడు :** ఈ క్లస్టర్ స్కూళ్ళవల్ల కొత్తగా వచ్చే పోస్టులెన్ని? తగ్గిపోయే పోస్టులెన్ని? తక్షణం చూస్తే అదనపు టీచర్లు భారీగా తయారయ్యే ప్రమాదం వుంది? క్లస్టర్ స్కూళ్ళలో విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని 20%గా చెయ్యవచ్చు. ఇంగ్లీషు, ఆర్ట్, వ్యాయామం లాంటివి కూడా చేర్చవచ్చు. ఇంగ్లీషు తప్పనిసరి. ఇలా అందరు టీచర్లు అబ్జార్బు అయ్యేలా వుండే విధానం వుండాలిగదా. దీనికోసం ప్రస్తుత క్యాడర్ విధానాన్ని మార్చడం ఎంతైనా మంచిది.

**నాలుగు :** క్లస్టర్ స్కూళ్ళు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళా? రెండు మీడియంలు వుంటాయా? ప్రజల మోజు ఇంగ్లీషు మీడియంకు అను కూలంగా వుంది. ఎంత మంచి తెలుగు మీడియం పాఠశాలనైనా జనం ఆదరించరని, ఎంత చెత్త ఇంగ్లీషు మీడియం స్కూల్‌నైనా గుండెలకు హత్తుకొంటారని ఒప్పుకొక తప్పదుగదా! అలా అయితే ఇక ఆంధ్రప్రదేశంలో తెలుగు మీడియం అంతరిస్తుందన్న మాట. ప్రపంచంలో, మన దేశంలో ఇదెక్కడయినా వుందా?

ఇంగ్లీషును శక్తివంతంగా, ఆకర్షణీయంగా బోధించే విధానాన్ని, ఏర్పాట్లను, ప్రత్యేక సాధనాలను, టీచర్లను నియమించి రెండు భాషలకూ సమ ప్రాధాన్యతనిచ్చి ఒక క్రమంలో అవసరమైతే ఇంగ్లీషు మీడియంలోకి వెళ్ళదల్చుకున్న వాళ్ళు వెళ్ళేలా ఏర్పాటు చెయ్యవచ్చుగదా! దీనికి ఒక దార్శనికత వుండాలి. టీచర్లకి మంచి శిక్షణ వుండాలి. ఈ అకడమిక్ తాత్వికతమనకుందా?

**అయిదు :** బడ్జెట్ సంగతి ఏమిటి? ప్రస్తుత బడ్జెట్‌తోనే సరిపెట్టి, సర్దుబాటు చేసి టీచర్ల పోస్టులు కుదించి క్లస్టర్ స్కూళ్ళను నడిపిస్తారా? అసలు ఒక క్లస్టర్ స్కూల్ బడ్జెట్ ఎంత? దీనికి తగ్గ కెటాయింపులేవి? ప్రస్తుతం మనం నడుస్తున్నదే కేంద్ర ప్రభుత్వ నిధుల మీదేగదా.

ప్రతి క్లస్టర్ స్కూల్‌కు వెంటనే కోటి రూపాయలు, రెండు మూడేళ్ళలో మరో కోటి తప్పనిసరి అవసరం. కనీసం 10వేల క్లస్టర్ స్కూళ్ళు అవసర మనుకొంటే రూ.20000/- కోట్లు అయిదేళ్ళలో ఖర్చు చెయ్యడానికి సిద్ధంగా వుండాలి. ఏడాదికి రూ.4000/- కోట్లు పెద్ద కష్టమేమి కాదు. టీచర్ల జీతాలుగాక అదనంగా పెట్టాల్సిన వ్యయమిది. దీనికి ప్రభుత్వం రాజకీయంగా సిద్ధపడాలి.

**ఆరు :** ప్రైవేట్ స్కూళ్ళలోని పిల్లల సంగతి. మంచి ప్రాథమిక పాఠశాలల న్నవి కేవలం ప్రస్తుతం మన పాఠశాలల్లోని పిల్లల్ని దృష్టిలో వుంచుకొని ఏర్పాటు చేస్తారా? ప్రైవేట్ స్కూళ్ళు ఇలానే వుండాలనీ, వీటికి వీలున్నంత మంది వెళ్ళాలనీ, మిగిలిన వారికి వున్నంతలో మంచి స్కూళ్ళు పెడతామనీ అంటారా? ప్రైవేట్ స్కూళ్ళ పిల్లల్ని కూడా ఈ క్లస్టర్ స్కూళ్ళలోకి తెచ్చేలా దూరదృష్టిని ప్రదర్శిస్తారా?

ఖచ్చితంగా క్లసర్ స్కూళ్ళు కామన్ స్కూళ్ళుగా మారాలి. ఒక నిర్దిష్ట ప్రాంతానికి ఒక స్కూలు- ప్రభుత్వరంగంలో అందరూ సమానంగా చదువుకొనే స్కూల్ వుండి తీరాలి. ఇదే క్లస్టర్ స్కూల్ లక్ష్యం కావాలి. అలా కావాలంటే 400-500మంది పిల్లలుండే స్థాయికి ఇవి ఎదగాలన్న దార్శనికత వుండాలి. అంతటి స్థలం, రవాణా సదుపాయం, అందుబాటు ఈ పాఠశాలలకుండాలి.

**ఏడు :** మారుమూల, దూరంగా వున్న దళితుల, గిరిజనుల పాఠశాలల్ని కూడా క్లస్టర్ స్కూళ్ళలో కలిపేసి మూసేస్తారా? ఆ పిల్లలు తమ ఆవాస ప్రాంతం వదిలి రావడానికి ఎదురయ్యే ఇబ్బందులు ఏమిటి? ఫలితంగా ఈ సెక్షన్ల పిల్లలు బడిమానెయ్యరా? ఏకొద్ది మంది మానేసినా నష్టం గదా!

తప్పనిసరిగా ఈ పాఠశాలలకు అన్ని హక్కులు, అన్ని వసతులు, సదుపాయాలు ప్రోత్సాహకాలు వుండాలి. అదే సందర్భంలో పిల్లల సంఖ్యతో నిమిత్తం లేకుండా వారు వారి ఆవాస పాఠశాలలోనే చదువు కొనే హక్కు అవకాశమూ వుండి తీరాలి.

**ఎనిమిది :** అంతా బ్యూరాక్రటిక్‌గా చేస్తారా? రాజకీయంగా నిర్ణయం చేస్తారా? అలా చేస్తే వీటిని జనం ఆమోదిస్తారా? ప్రజల భాగస్వామ్యం, ఆమోదం అన్నిటికంటే ముఖ్యమైనవి. మంచి స్థలం సమకూర్చిన చోట, దాతలు ముందుకొచ్చిన చోట, స్కూల్‌ను నడుపుకునేందుకు జనం ముందుకొచ్చిన చోట క్లస్టర్ స్కూళ్ళను మొదట ప్రారంభించడం మంచిది. చుట్టూవున్న స్కూళ్ళనుంచి పిల్లలు వచ్చేలా ప్రజలు సహకరించే చోట క్లస్టర్ స్కూళ్ళను పెట్టడం మంచిది.

**తొమ్మిది :** ప్రభుత్వానికి హడావుడి ఎక్కువ. ఆంధ్రులకు ఆరంభ శూరత్వం ఎక్కువ. మోడల్ స్కూళ్ళు, గురుకులాలు ఎలా వున్నాయో మనం చూస్తూనే వున్నాం. ఇబ్బడిముబ్బడిగా కస్తూర్బా స్కూళ్ళు పెట్టి ఎలా సతమతమవుతున్నామో మనందరికీ తెలుసు. అంత హడావుడి ఏమి అక్కర లేదు. రాష్ట్రాన్నంతా క్లస్టర్ స్కూళ్ళమయం చెయ్యాల్సిన పనిలేదు. అన్నీ బాగున్న చోట మండలానికి ఒకటి రెండు ఈ స్కూళ్ళు పెట్టి చూడొచ్చు. జనానికి ప్రభుత్వ చిత్తశుద్ధి ఎంతో అర్థమవుతుంది. ప్రభుత్వానికి ప్రజల స్పందన ఎలా వుంటుందో తెలుస్తుంది. లోపాలు కూడా బయట పడతాయి. అనుభవాన్ని బట్టి ముందుకెళ్ళవచ్చు.

**మన భయాలు, మన జాగ్రత్తలు :** అయితే మన భయాలు మనకున్నాయి. కార్పొరేట్ విద్యాధిపతులు రాజకీయాల్ని శాసిస్తున్న కాలంలో మనమున్నాం. అంతా ప్రైవేట్‌మయం చేస్తున్న రోజులు మనవి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దూకుడు స్పష్టంగానే అర్థమవుతూ వుంది. ఏకాఏకిన రాజస్థాన్‌లో 17వేలు, మహారాష్ట్రలో 14వేలు స్కూళ్ళు మూసివేశారు. ఒరిస్సా ఈ దారిలోనే వుంది. 'మంచి చదువు అందరికీ సమానంగా, నాణ్యంగా అందివ్వడం ప్రభుత్వ బాధ్యతల్లో మొదటిది' అన్న సూత్రాన్ని మన రాజకీయ వ్యవస్థ ఇప్పటికీ ఎంత అంగీకరించిందన్నది తీవ్రంగా ప్రశ్నార్థకం. ఈ స్థితిలో భారం తగ్గించుకోడానికీ, ప్రైవేట్‌పరం చెయ్యడానికి, ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేర వదిలించుకోవడానికీ ఈ వ్యవహారమంతా దారితీస్తుందా? టీచర్ల పోస్టుల్ని భారీగా కోత పెడతారా? ఇవన్నీ మన భయలు, అనుమానాలు.

వీటిని నివృత్తి చెయ్యాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఇక మనం కూడా అమాయకంగానూ, అర్థమనస్కంగానూ వుండ నక్కరలేదు. దూరదూరంగానో, అనుమానాలతోనూ చూడనక్కర లేదు. ఇప్పటి వ్యవస్థ ఇక నడవదు. కొత్త వ్యవస్థ రాకతప్పదు. దీన్ని అర్థం చేసుకోవాలి. కొత్త పేర మొత్తం కూల్చేసే ప్రయత్నం జరగొచ్చు. దీనికి అప్రమత్తంగా వుండాలి. ఇది జరగాలంటే ఏం జరుగుతుందో మొదట తెలుసుకోవాలి. లోతుగా తెలుసుకోవాలి. కొన్ని మండలాల్లో మనమూ మన సర్వే చెయ్యాలి. ఒక ప్రత్యామ్నాయాన్ని ప్రతిపాదించాలి. దీనిపై పోరాడాలి.




# పెను ప్రమాదంలో పాఠశాలలు

విద్యార్థుల హాజరు శాతం తక్కువగా వుందనే కారణంతో మహా రాష్ట్ర ప్రభుత్వం 14000 పాఠశాలల్ని, రాజస్థాన్ ప్రభుత్వం 17000 పాఠశాలల్ని, ఒడిసా ప్రభుత్వం 195 పాఠశాలల్ని మూసివేయాలని నిర్ణయించారు. ఈ చర్యలు ఏవో సాధారణంగా జరిగిన సంఘటనలుగా కాకుండా, పతనమవుతున్న పబ్లిక్ విద్యా వ్యవస్థకు సూచికలుగా చూడాలి. ప్రైవేట్ విద్యా వ్యవస్థ యొక్క పెరుగుదల, దానివలన వచ్చే సమస్యలను ఒక ఉదాహరణ ద్వారా చూద్దాము. ఇటీవల ఒక తండ్రి తన కొడుకు, చదువులో చురుకుగా లేకపోవడానికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు చెప్పిన కారణాన్ని నాతో చెప్పారు. సైన్స్, సాంఘిక శాస్త్ర మరియు ఆంగ్ల ఉపాధ్యాయులు సమస్య పరిష్కరించమని తండ్రిని ఆదేశించారట. తనకొడుకు పాఠశాలలో ఉన్నప్పుడు సరిగ్గా ప్రవర్తించ కపోవడానికి, తనకు చెప్పిన పనిని పూర్తి చేయకపోవడానికి గల కారణా లను పరిష్కరించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులది కదా! ఒకవేళ పిల్లలు ఇంట్లో సరిగ్గా రాయడం, చదవడం చేయకపోయినా, సరిగ్గా ప్రవర్తించకపోయినా తల్లితండ్రులుగా మనమే చూసుకుంటాం కదా!. ఉపాధ్యాయులను దానికి బాధ్యులుగా చేయంకదా! నేటి ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ప్రతి చిన్న విషయానికి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేస్తున్నారు లేదా బాధ్యులను చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థి యొక్క చదవడం-రాయడం లాంటి విద్యా విషయాలకు బాధ్యత వహించాలి, తల్లితండ్రులు సౌకర్యాలు కల్పించే వారిగా ఉండాలని అతని అభిప్రాయం.



రోహిత్ ధనకర్

పిల్లల చదువుకి, ప్రవర్తనకి తల్లిదండ్రులను బాధ్యులను చేసే ధోరణి ముందుగా, హాయ్యర్ మరియు సెకండరీగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రారంభం అయి నేడు చిన్న చిన్న పాఠశాలలకు కూడా పాకింది.

**ప్రభుత్వ పాఠశాలల పతనం :** సరైన ఫలితాలు సాధించకపోవడం వలన ప్రభుత్వ పాఠశాలలు నీరసించిపోతున్నాయి. 1950-1960 ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించారు. కాని వాటికి వసతి సౌకర్యాలు కల్పించడంలో మరియు శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందించడంలో విఫలం చెందడం వలన ఈ సమస్య ఉత్పన్నమైంది. అనేక రాష్ట్రాల్లో అధికారుల పర్యవేక్షణ సమర్థవంతంగా లేకపోవడం మరియు ఉపాధ్యాయులకు నామమాత్రపు వేతనాలు ఇవ్వడం కూడా ఒక ప్రధాన కారణం. రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో అనేకమంది ఉపాధ్యాయులు శిక్షణ కూడా లేకుండా ఉన్నారు. ఇవన్నీ విద్య యొక్క నాణ్యత మీద ప్రభావం చూపాయి. ఉపాధ్యాయుల ఉత్సాహాన్ని నీరుగార్చాయి.

1950ల నుంచి కొన్ని ప్రభుత్వాలు ఉపాధ్యాయులు మీద పర్యవేక్షణ ను పంచాయితీ సంస్థలకు అప్పగించడం ప్రారంభించాయి. ఫలితంగా స్థానిక రాజకీయ నాయకులు. ఉపాధ్యాయుల బదిలీల్లో జోక్యం చేసుకొన్నారు. అప్పటికే వున్న వసతుల లేమి, అతి తక్కువ వేతనాలు మరియు సరి అయిన సమయానికి వేతనాలు అందిం చకపోవడం - ఉపాధ్యాయులు గైర్హాజరికీ కారణమయ్యి పరిస్థితిని దిగజార్చింది. ఈ పరిస్థితిల్లో ఉపాధ్యాయ సంఘాలు తమ సంక్షే మానికి ప్రాధాన్యత ఇచ్చి పాఠశా లల నిర్వహణను మరియు విద్యా ప్రమాణాలను పట్టించుకోలేదు. ఈ విధంగా వ్యవహరించినందుకు మనం సంఘాలను నిందించలేం. ఈ సమస్యల్ని పరిష్కరించాల్సిన పాలకులు, విద్యా ప్రణాళికలు తయారుచేయు అధికారులు తాత్కాలిక మరియు తక్కువ నిధులు అవసర మయ్యే చర్యల ద్వారా పెరుగుతున్న విద్యా అవసరాలని తీర్చాలని ప్రయత్నించారు. వారికి ఈ విధమైన ఆలోచనలు రావడానికి - ఎక్కువ పాఠశాలలు కావాలని ఒత్తిడి రావడం, ఆర్థిక మరియు ఇతర వనరుల కొరత, సమస్యను పరిష్కరించేవిధంగా కన్పించే రాజకీయ ఒత్తిళ్లు, ఎవరికీ సరైన బాధ్యత లేకపోవడం కారణం అయి వుండవచ్చు. 1960ల తర్వాత ప్రారంభమైన అన్ని పథకాలలోనూ ఈ ఆలోచన కన్పిస్తుంది. అనియత విద్య, శిక్షా కర్మి, డిపిఇపి, ఎస్ఎస్ఏ లాంటి అన్ని పథకాలలో ఇది కన్పిస్తుంది. ప్రతి దశలలోనూ ఈ పథకాలలోని లోపాలను, ప్రణాళిక అమలులోని సమస్యలను, సరిఅయిన అవగాహనా లేమిని - విద్యావేత్తలు సూచించడం జరిగింది. కాని ఆ పథకాలను సమర్థించేవారు కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో వుండి, విద్యామార్పుకి ఆ పథకాలు ఉపయోగపడతాయని నమ్మించారు.

**పాఠశాల - ఓ గొప్ప ఆలోచన :** పైన చెప్పిన పథకాలన్నిం టిలోనూ, పాఠశాల యొక్క నిజమైన భావాన్ని, అవగాహనను తప్పుగా చూపే ప్రాథమిక సమస్య దాగివుంది. పాఠశాలలకి ఒక లక్ష్యం వుంది, అది 'అభ్యసనం'. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుల, విద్యార్థుల భాగస్వామ్యం తప్పనిసరి. మానసిక క్రమశిక్షణ మరియు మేథోపరమైన అభివృద్ధి జరగాలంటే నూతన ఆలోచనలకు, ప్రయోగాలకు సమయం మరియు స్థలం ఉండాలి. ఆ ఆలోచనలను ఒక క్రమపద్ధతిలో కొనసాగించాలి. ఏం నేర్చుకోవాలి, ఎలా నేర్పాలి - అనే విషయాన్ని జాగ్రత్తగా ఎంపిక చేయకపోతే ఇది సాధ్యం కాదు. అందువలన ఒక పాఠశాల - వృత్తిపరమైన జ్ఞానాన్ని, విద్యార్థుల యొక్క అవసరాల్ని, భావోద్వేగాల్ని, మేధస్సుని అర్థం చేసుకునే తత్వాన్ని మరియు విద్యా విషయక అవగాహనను కలిగి వున్న ఉపాధ్యా యులను కలిగి వుండాలి. గత 5 దశాబ్దాలుగా పై విషయాలను ఒక దానికి ఒకటి పోటిగా పెట్టి, మన విద్యా విధానం, పాఠశాల అనే భావనను తప్పుదోవపట్టించారు. 1960 నుండి 1990 వరకు దేశంలో అమలు చేయబడిన అనియత విద్యా బోధనా పథకం కోసం కోట్లకొలది ధనం ఖర్చు చేయడం జరిగింది. ఈ పథకం బోధనలో వుండవలసిన వృత్తిపరమైన జ్ఞానాన్ని, ఉపాధ్యాయ శిక్షణను మరియు విద్యా ప్రణాళి కను వదిలి వేయడంతోపాటు - ఎవరైనా బోధించవచ్చు అను భావనను దేశవ్యాప్తంగా కలిగించింది. అన్ని వసతులతో

విశాలమైన ప్రాంగణంలో పాఠశాల వుండాల్సిన అవసరం లేదనే భావనను పెంపొందించింది. ఈ భావన, ఉపాధ్యాయుల మరియు విద్యార్థుల యొక్క మేధపరమైన డిమాండ్లను పట్టించుకోలేదు. మొత్తం మీద విద్య యొక్క, ఉపాధ్యాయుని యొక్క, పాఠశాల యొక్క భావాన్ని, విలువని తగ్గించివేసింది.

ఈ విధానంలోని లోపాలని గుర్తించేసరికి అనేకమంది ఇతర నూతన ఆవిష్కర్తలు, అనేక ఇతర నూతన పథకాలతో ముందుకు వచ్చారు. రాజస్థాన్‌లో శిక్షాకర్మి పథకం, డిపిఇపి పథకం ఈ కోవలోకే వస్తాయి. వృత్తిపరమైన జ్ఞానానికి, మేధస్సుకి, పిల్లల పట్ల సున్నిత భావన మరియు మౌలిక సౌకర్యాల మధ్య ఒక సమతుల్యత సాధించడానికి ప్రయత్నం చేయలేదు. సర్వశిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కూడా దీనికి మినహాయింపు కాదు. మంచి విద్య యొక్క లక్ష్యం మీద అవగాహన లేకపోవడం, గతంలో తప్పుడు విధానాలు అవలంభించడం వలన నేడు పాఠశాలలు మూతపడుతున్నాయి.

**అభ్యసనా పద్ధతులు :** ఈ పరిస్థితుల్లోనే తల్లితండ్రుల యొక్క ఆతృతను లాభంగా మార్చుకొనేందుకు ప్రైవేట్‌రంగం ప్రవేశించింది. నేడు ప్రైవేట్ పాఠశాలల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. కొంతమంది విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వ విద్య రోజురోజుకి పతనమవుతుండగా, ప్రైవేట్ విద్య మరింత బలోపేతం అవుతూ వుంది. ఈ విధమైన అభిప్రాయం కావాలని ప్రచారం చేస్తున్నట్లుగా వుంది. ప్రైవేట్ పాఠశాలల పనే లాభం ఆర్జించడం. ఈ విషయం మంచి పాఠశాల అనుభవానికి విరుద్ధం. విజ్ఞానాన్ని, జ్ఞానాన్ని అందించడం, మేధస్సుని వృద్ధి పరచడం, పిల్లల పట్ల ప్రేమను పెంపొందించడం, అన్ని వసతులు కలిగి వుండటం, ఒక మంచి పాఠశాల లక్షణం... లాభాలను పెంచుకోవాలని ప్రయత్నించే ప్రైవేట్ యజమానులు అవగాహనతో కూడిన బోధనకు బదులుగా అనారోగ్యకర పోటీని పెంచుతారు. ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు బలవంతంగా బట్టీ పద్ధతిలో విద్యను నేర్పి, అవగాహన యొక్క విలువను తెలుసుకోకుండా చేస్తున్నారు. వాస్తవంగా 'అభ్యసనం' నేర్చుకునే విషయం పట్ల స్పష్టతను, అవగాహనను పెంపొందించాలి. దీనికి ఎంతో సమయం వెచ్చించాలి. ప్రైవేట్ పాఠశాలలు బట్టీ పద్ధతిని ప్రోత్సహిస్తున్నాయి. ఇంకొక మాటలో చెప్పాలంటే వారు 'అభ్యసనం' యొక్క నిజమైన అర్థాన్ని నిర్వీర్యం చేయడం ద్వారా మంచి పాఠశాల కోసం చేసే డిమాండ్లను నిర్లక్ష్యం చేసే పరిస్థితి కల్పిస్తారు.

ప్రైవేట్ విద్యా విధానం యొక్క, ఆందోళన కలిగించే మరొక ముఖ్యమైన విషయం–విద్యార్థులయొక్క నైతిక ఎదుగుదలకు మరియు ప్రవర్తనకు అవి ఏ మాత్రం బాధ్యత వహించకపోవడం. వారు కేవలం కన్సల్టెంట్ సంస్థలుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు నైతిక మరియు ప్రవర్తనా పరమైన ఇబ్బందులు తలెత్తితే, తల్లిదండ్రులను పిలిచి సమస్యలు పరిష్కరించుకోమని చెబుతారు; చదువులో వెకనబడితే ట్యూషన్లు ఏర్పాటుచేసుకోవాలని సలహా ఇస్తారు. ఏదో విధంగా బోధకుడిగా, తమ బాధ్యత నుంచి తప్పకోజూస్తారు. వారి పాత్రను సాధ్యమైనంత తగ్గించుకొని, లాభాలను పెంచుకొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు తగ్గిపోవడం, ప్రైవేట్ పాఠశాలలు 'బడి' అను భావనను తప్పుదోవ పట్టించడం అను రెండు రుగ్మతలు మన పాఠశాలలను పెను ప్రమాదంలోకి నెడుతున్నాయి. నాగరికతలు విద్య పైన ఆధారపడి వుంటాయని, ఆ విద్యకు ప్రాథమికమైన అవసరం పాఠశాలలు అని మన సమాజం గుర్తించడం లేదు. పాఠశాలలు నాశన మైతే, నాగరికతలు పతనమవుతాయి. విద్యపట్ల ఒక సరైన అవగాహన, ప్రణాళిక–వాటి అమలులో చిత్తశుద్ధి యొక్క అవసరాన్ని మనం గుర్తించనంతకాలం ఈ పతనం కొనసాగుతుంది. మన పాఠశాలలు మూసివేసుకోవాలి లేదా సలహా సంస్థలుగా (కన్సల్‌టెన్సీ)గా మారి పోవాలి, ట్యూషన్ షాపులకు పెద్దఎత్తున అవకాశం కల్పించాలి. ఈ పరిస్థితిలో మార్పురావాలంటే సరిఅయిన రాజకీయ ఆర్థిక నిర్ణయాలు జరగాలి.

– ది హిందూ సౌజన్యంతో (అనువాదం: రాజగోపాల్‌బాబు)



## ఎందుకీ వివక్ష

– వై.వి.సుబ్బారెడ్డి, కదిరి, అనంతపురం

అమ్మా – నాన్న ఆలోచించండి ఎందుకీ వివక్ష!
అమ్మా – నాన్న ఆలోచించండి ఎందుకీ వివక్ష!
పుడమిపైకి రాకముందే తల్లిగర్భమందే
ఆడబిడ్డైతే అంతం చేయాలనుకొంటిరి
అయితే స్కానింగ్ నిషేదపుణ్యాన మిమ్మల్ని వెనక్కుపంపిరి.
అయినా ఎందుకీ వివక్ష
నాకేమో రోగమొస్తె సర్కారీ దవాఖానకెళ్ళమంటిరి
అన్నకేమో జబ్బొస్తే పెద్దాసుపత్రికెళ్ళి ఖర్చుచేసి వైద్యం చేయిస్తిరి.
మళ్ళీ నన్నేమో ప్రభుత్వ అంగన్‌వాడి కేంద్రానికెళ్ళమంటిరి
అన్ననేమో జాగ్రత్తగా వ్యాన్ ఎక్కించి ఖరీదైనా ప్రిస్కూల్‌లో చేర్పితిరి
అయినా ఎందుకీ వివక్ష
మళ్ళీ నాకేమో సర్కారీ బడే గతి అంటిరి.
అన్ననేమో ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అప్పుచేసి చేర్పిస్తిరి.
నాకేమో ఇంటిపనే ముఖ్యం ఆ తర్వాతే చదువని టార్గెట్ పెట్టితిరి.
అన్నకేమో చదువు మాత్రమే వేరే పనొద్దంటిరి
అయినా ఎందుకీ వివక్ష!
నన్నేమో సర్కారీ యూనిఫాం, హవాయి చెప్పులు, అన్నపాత బ్యాగ్‌తో గడిపేయమంటిరి
అన్నకేమో క్లాస్ క్వాలిటీ యూనిఫాం. రెండు జతల షూస్‌తో మెరిపిస్తిరి
అన్నకేమో హొంవర్క్ ఎక్కువైందంటూ ఆవర్క్ కూడా నన్నే చేయమంటిరి
అన్ననేమో అలసిపోయావు టి.వి. చూడు లేదా ఆడుకోమంటారు.
అయినా ఎందుకీ వివక్ష!
మరి అన్ననేమో డాక్టరే కావాలి, కావాలి అంటిరి కానీ అన్నేమో యం.పి.సి. చదువుతానంటే తప్పదనుకొంటిరి.
నన్నేమో ఏదో ఒకటి చదివితగలడమంటిరి.
అన్ననేమో మహానగరంలో భూములమ్మి లక్షలు పోసి చదివిస్తిరి
నన్నేమో ఇంటిపని చూసుకుంటూ స్థానిక ప్రభుత్వ కాలేజీలో చేరమంటిరి
కానీ
అన్ననేమో యం.సెట్ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో ర్యాంకు 'ల' కారానికి (లక్ష) దగ్గరొచ్చె
మళ్ళేమో నాకు మెడికల్ ఎంట్రెన్స్‌లో వందల్లో ర్యాంకొచ్చె
అయినా ఎందుకీ వివక్ష!
అన్నట్లు అన్నకేమో ప్రైవేటు స్కూళ్ళల్లో చదివి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో డోనేషన్‌తో సీటొచ్చె
నాకేమో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి గవర్నమెంట్ మెడికల్ కాలేజ్‌లో సీటొచ్చె.....
అమ్మా నాన్న ఆలోచించండి ఎందుకీ వివక్ష!
అమ్మా నాన్న ఆలోచించండి ఎందుకీ వివక్ష!!




# ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS)

## నూతన మార్గదర్శకాలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ఉద్యోగుల ఆరోగ్య పథకం' (ఇహెచ్ఎస్) అమలుకై నూతన రాష్ట్ర ప్రభుత్వం జిఓ ఎంఎస్ నం.134, 135 హెచ్ఎం & ఇడబ్ల్యు; తేది.29.10.2014 ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యము ఉన్న వారందరికీ నగదు రహిత చికిత్స ఈ పథకము ద్వారా వర్తిస్తుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ఈ ఉత్తర్వులలో పేర్కొన్న నూతన మార్గదర్శకాలు తెలుసుకుందాము.



యన్.కుమార్ రాజా
ఐక్యఉపాధ్యాయ సంపాదకులు

రాష్ట్ర ప్రభుత్వము 2013 డిసెంబర్ 5న లాంఛనముగా ప్రారంభించి అమలు జరుపుతున్న ఉద్యోగుల ఆరోగ్య పథకమునకు కొన్ని సవరణలు చేస్తూ జిఓ 134, తేది.29.10.2014ను విడుదల చేయడం జరిగింది. ఈ సవరణ ఉత్తర్వులు మేరకు....

1. మొదటి దశలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రొవిన్షనలైజ్డ్ అయిన స్థానిక సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సర్వీస్ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు, రీ– ఎంప్లాయిడ్ పెన్షనర్లు అందరికీ హెల్త్‌కార్డులు జారీచేసి, ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.
2. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు జారీచేసే హెల్త్‌కార్డులను బయోమెట్రిక్ గుర్తింపుకై ఆధార్‌కార్డులకు అనుసంధానము చేస్తారు.
3. ప్రస్తుతం అమలులో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ విధానము తేది.01.12.2014 నుండి చేయించుకునే వైద్య చికిత్సలకు అంగీకరించబడదు.
4. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల నుండి వారు చెల్లించ వలసిన నెలవారీ ప్రీమియంను నవంబర్ 2014 జీతపు బిల్లు నుండి మినహాయింపు చేయడం ప్రారంభిస్తారు.
5. గుండెకు సంబంధించిన యాంజిమో ప్లాస్టీ (పిటిసిఏ) శస్త్ర చికిత్సలకు ఇకపై మెటల్‌స్టెంట్ చికిత్సకు రూ.55,000/–లు, ముందుపూత స్టెంట్ చికిత్సకు రూ.65,000/–లు మొత్తాన్ని మాత్రమే అనుమతిస్తారు.
6. ఉద్యోగుల ఆరోగ్య పథకము క్రిందగల మొత్తం 1885 రకాల చికిత్సలలో 347 చికిత్సలను తొలుత ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం చేశారు. ప్రస్తుతం ఈ 347 చికిత్సలనూ ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులలో చేయించు కొనుటకు అనుమతిస్తారు. అయితే ఈ విధానాన్ని ఆరు నెలల తర్వాత సమీక్షించి కొనసాగించాలా...ప్రభుత్వ ఆసుపత్రులకే పరిమితం చేయాలా నిర్ణయిస్తారు.
7. ఉద్యోగుల ఆరోగ్య పథకము అమలుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా ఒక స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయబడుతుంది. ఈ కమిటీలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల, పెన్షనర్స్ సంఘాల నుండి 10మంది సభ్యులను నియమిస్తారు. ఈ కమిటీ పథకము అమలును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పథకము అభివృద్ధికి సూచనలు అందిస్తుంది.
8. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంవత్సర బడ్జెట్ 220 కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఇందులో 40% ఉద్యోగుల ప్రీమియం కంట్రిబ్యూషన్‌గాను, 60% ప్రభుత్వ కంట్రిబ్యూషన్ గాను ఉంటుంది.
9. నెలవారీ కంట్రిబ్యూషన్‌ల నుండి ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌కు నిధులు జారీ చేయుటకు, పథకము అమలుకు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ఉత్తర్వులు జారీచేస్తుంది.
10. పథకము అమలుకు రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ, ఆర్థికశాఖ, ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌లు తగిన చర్యలు చేపడతాయి.

ఇక దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి అవుట్ పేషెంట్ (ఓపి) చికిత్స పొందటానికి మార్గదర్శకాలు తెలియజేస్తూ జిఓ 135, తేది. 29.10.2014న విడుదల చేయడం జరిగింది. ఈ ఉత్తర్వుల ప్రకారం .....

1. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి అవుట్ పేషెంట్ కన్సల్టేషన్, మందులు మరియు చికిత్సకు మొత్తము పథక బడ్జెట్ 220 కోట్ల నుండి 15% కేటాయిస్తారు.
2. అవుట్ పేషెంట్ (ఓపి) చికిత్స క్రింద దీర్ఘకాలిక రోగాలైన డయాబెటిస్, హైపర్ టెన్షన్, కరోనరీ ఆర్టరీ వ్యాధులు, సెరిబ్రో వాస్క్యులార్ వ్యాధులు, క్యాన్సర్, క్షయ, కుష్టు వ్యాధులు, సర్జరీల అనంతరము కొనసాగించవలసిన చికిత్సలను అనుమతిస్తారు.

# శాసనమండలి ఎన్నికలు - ఓటర్ల నమోదు షెడ్యూల్

కృష్ణా-గుంటూరు మారియు తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాలు రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలలో ఓటర్ల నమోదుకు షెడ్యూల్ ప్రకటించారు. (ఎన్నికల కమీషన్ ప్రెస్‌నోట్ నం12342/ఎలక్షన్.ఇ/ ఎ3/2014-7; తేది. 25.10.2014)

**షెడ్యూల్ సమాచారం :**

1. నవంబర్ 1 నుండి 11 వరకు గత ఓటర్ల జాబితాలోని వారంతా 'ఎపిక్ నం.' (జనరల్ ఓటర్ల జాబితా) నమోదు చేయించుకోవాలి.
2. 2014 నవంబర్ 11 నుండి నవంబర్ 23 వరకు అర్హులైన ఓటర్ల జాబితా తయారుచేసి నవంబర్ 25న లిస్టు పబ్లిష్ చేస్తారు.
3. 2014 నవంబర్ 25 నుండి డిసెంబర్ 16 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, కొత్తగా చేరదలచిన వారు ఫారమ్-19 ద్వారా అప్లై చేయాలి.
4. 2014 డిసెంబర్ 5న మొదటి లిస్టు ప్రకటిస్తారు. డిసెంబర్ 12న రెండవ లిస్టు ప్రకటిస్తారు.
5. 2014 డిసెంబర్ 16 వరకు అభ్యంతరాలకు క్లైమ్‌లు ఇవ్వవచ్చు.
6. 2014 జనవరి 1న క్లైమ్‌లు, అభ్యంతరాలను ఫైనల్ చేసి 2014 జనవరి 13న సప్లిమెంటరీ లిస్టుతో కలిపి ఓటర్ల జాబితా ముద్రించుతారు.
7. 2014 జనవరి 15న తుది జాబితా ప్రకటిస్తారు.

**షెడ్యూల్ ముఖ్యాంశాలు :**

1. గతంలో ఉన్న ఓటర్ల 'ఎపిక్ నం.' నమోదు చేయించాలి.
2. 2014 నవంబర్ 25 నుండి డిసెంబర్ 16 వరకు రెండు దఫాలుగా నమోదు, అభ్యంతరాలు కేంద్రీకరించాలి.

**ఓటర్ నమోదు అర్హత :**

1. 2014 నవంబర్ 1న క్వాలిఫైయింగ్ తేదీగా ఉంటుంది. ఈ తేదీకి ముందు 6 సంవత్సరాల కాల వ్యవధిలో 2008 నవంబర్ 1 నుండి 2014 నవంబవర్ 1 వరకు కనీసం 3 సంవత్సరాలు హైస్కూల్ అంతకన్నా పై స్థాయి విద్యా సంస్థలు పనిచేసి ఉండాలి. అంటే 2008 నవంబర్ 1 నుండి 2014 నవంబర్ 1 మధ్య 3 సంవత్సరాలు ఉండాలి. ఈ కాలంలో వేరువేరు పాఠశాల సర్వీసును పరిగణలోకి తీసుకోబడుతుంది.
2. సంబంధిత ఉపాధ్యాయ నియోజకవర్గంలో నివాసం ఉండి, అసెంబ్లీ నియోజకవర్గం ఓటరుగా నమోదు అయి ఉండాలి.
3. ఫారం-19తోపాటు, ఫోటో, ఎపిక్ కార్డ్ నెంబర్ (ఓటర్ ఐడి) సర్వీసు సర్టిఫికేట్ జతచేయాలి.

3. దీర్ఘకాలిక అవుట్‌పేషెంట్ చికిత్సలకు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, టీచింగ్ ఆసుపత్రులకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ప్రత్యేక క్లినిక్‌లు నిర్వహిస్తారు.
4. ఈ క్లినిక్‌లలో కన్సల్‌టెంట్ డాక్టర్, ఫార్మసీ, రేడియాలజీ, క్లినికల్ సేవలు అందుబాటులో ఉంటాయి.
5. 40 సంవత్సరాలు దాటిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరానికి ఒకసారి ప్రత్యేకంగా గుర్తించిన ఆసుపత్రులలో ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకొనవచ్చును. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడిగా జారీ చేయబడతాయి.

అయితే ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ఎయిడెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, గురుకులాల సిబ్బందికి, ప్రభుత్వరంగ ఉద్యోగులకు, వివిధ సొసైటీల ఉద్యోగులకు వర్తింపజేయాల్సి ఉన్నది. ఉత్తర్వులలో పేర్కొన్న మేరకు రెండవ దశలో సత్వరమే వీరందరికీ ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని వర్తింపజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అలాగే పైన తెలిపిన ఉత్తర్వుల మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పర్మినెంట్ హెల్త్‌కార్డుల జారీకి, అన్ని నోటిఫైడ్ ఆసుపత్రులలో నగదు రహిత చికిత్స అందించంలో ఎటువంటి ఆటంకాలు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలి. ఇప్పటికీ ఉద్యోగుల ఆరోగ్య పథకంలో నమోదు కాని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకూ హెల్త్‌కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం శాఖాధిపతుల ద్వారా తగిన చర్యలు తీసుకోవాలి.

## ముఖ్యగమనిక


**ఐక్యఉపాధ్యాయ** పత్రిక డిసెంబర్ నెల నుండి విజయవాడ కేంద్రంగా నడుపబడుతుంది. ఈ నెల నుండి పత్రికకి పంపే వ్యాసాలు, ఉద్యమ వార్తలు, కథలు-కవితలు-గేయాలు, ప్రశ్నలు అన్ని రకాల వార్తలు **ఎడిటర్ ఐక్యఉపాధ్యాయ, యుటియఫ్ ఆఫీస్, పాలపర్తివారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520002 అడ్రసుకు పంపాలి, లేదా**

**E-Mails : ikyopadhyaya@gmail.com; aputf2000@yahoo.com**కి పంపాలి.

పత్రిక చందాలుకూడ విజయవాడకి పంపవలెను. జనవరి నుండి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాలి. పత్రికల సంఖ్య పెంచాలి. ప్రతి పాఠశాలకు పత్రిక వెళ్ళేలా చూడాలి. అడ్వర్‌టైజ్‌మెంట్‌లు సేకరించి పంపాలి.

# ప్రతిష్ట నిర్బంధ విద్య అమలే
# బాలకార్మికతకు పరిష్కారం




**బా**లల దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 14న మనదేశంలో, నవంబర్ 20న ప్రపంచ వ్యాప్తంగాను జరుపుకొంటారు. విశ్వవ్యాప్తంగా చూచినా ఈ ఉత్సవాన్ని స్కూలు పిల్లలు మాత్రమే చేసుకొంటారు. కోట్లాది మంది అనాధ వీధి బాలలు, బాలకార్మికులు దీనికి దూరంగానే వుంటారు. ఎప్పటిలాగే కాగితాలు ఏరుకొనే పిల్లవాడు ఏరుకొంటూనే వుంటాడు, హెూటల్లో బల్లలు తుడిచేవాడు తుడుస్తూనే వుంటాడు, బీడీలు చుట్టే అమ్మాయి చుట్టుతూనే వుంటుంది, నిద్రలేచి ఆకలికి ఏడ్చే పాలిపోయిన బిడ్డ ఈ అభివృద్ధి ప్రపంచానికి వినపడనంత బలహీనంగా ఏడుస్తూనే వుంటుంది. ఏ ప్రత్యేకతా వుండదు. టి.వీలలో, న్యూస్ పేపర్లలలో, మీటింగ్‌లలో మాత్రం రాజకీయ నాయకులు పిల్లలపట్ల ప్రేమ ఒలకబోయడం వుంటుంది. పిల్లల హక్కులపట్ల కంకణ బద్ధులమౌతామంటారు. ఈ చేష్టల పర్యావసానాలు ఏముంటాయి గనుక. సూర్యాస్తమయం లాగా ఈ పండగా వెళ్ళిపోతుంది. తర్వాతి రోజు నుండి ఎవరి రాజకీయాలు వారివి, ఎవరి లాభాలు వారివి.


సిహెచ్.శ్రీహరి
నెల్లూరు

మనదేశంలో ఎన్నో బాలల దినోత్సవాలు వచ్చిపోయినా గానీ ఇప్పటికీ 46 శాతం మంది 1 నుండి 8వ తరగతిలోపు బడిమానేస్తున్నారు. బడిలో వున్న వాళ్ళకూ నాణ్యమైన, సరదా సరదా చదువు లేదనే సంగతి అందరికీ తెలిసిందే. 48 శాతం ఐదు సంవత్సరములలోపు పిల్లలు పౌష్టికాహార లోపంతో వున్నారు. అందులో 3 లక్షల మంది సాదారణ జబ్బులతో ప్రతిఏటా చనిపోతున్నారు. గాజుల పరిశ్రమలలో, హెూటళ్ళలో, చేపల మార్కెట్‌లలో, ఇంజనీరింగ్ వర్క్‌షాపులలో బాలలు పనిచేస్తూ కనిపిస్తారు. అభివృద్ధికి నమూనాగా ప్రచారం జరుగుతోన్న గుజరాత్‌తో సహా. దాదాపు అందరు పిల్లలూ పెద్దల దాష్టీకానికి, దండనలకు గురౌతున్నవారే. శుభ్రమైన ఇల్లు, ఇంటిపరిసరాలు వున్నవాళ్ళు చాలా తక్కువ మందే. పిల్లల్ని అమ్మడం, తరలించడం నానాటికీ ఎక్కువ అవుతోంది. ఈ పరిస్థితుల మధ్య మన ప్రభుత్వాలు బాలల దినోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. చాక్లెట్లు పంచి, ప్రైజులు ఇచ్చి పబ్బం గడిపేస్తున్నాయి. బాలల దుర్భర పరిస్తితుల్ని మార్చే ఆలోచనా అందుకు తగ్గ కార్యాచరణా ప్రభుత్వం దగ్గర కన్పించదు. ఎవరికి వాళ్ళు శుభ్రంగా వుంటే లేదా టి.విలలో వీధులు ఊడిస్తే స్వచ్ఛభారత్ వస్తుందని, ఎవరి పిల్లల్ని వాళ్ళు జాగ్రత్తగా చూసుకొంటే బాల కార్మికులు ఉండరని ప్రభుత్వ పెద్దలు సందేశాలు ఇస్తుంటారు. ఒకవైపు తామనుసరించే దుర్మార్గ నయా ఉదార విధానాల గురించి గొప్పగా, అభివృద్ధికి మార్గాలుగా చూపుతూ, ఆ విధానాల ఫలితంగా నలిగిపోతున్న బాలల్ని రక్షించడం మా కర్తవ్యం అంటారు.

ఈ ఉదారవాద విధానాలకు బలౌతున్న వారిలో పేదలు, అణగారినవారు, పేదరికానికి జారిపోయిన మధ్య తరగతి, చిన్నగ్రామీణ ఉత్పత్తిదారులు, పోలీసులు, సైన్యంలో క్రింది శ్రేణివారూ ఉన్నారు. వీరి జీవన ప్రమాణాలు పెంచకుండా వీరి మధ్య ఉన్న పిల్లల్ని ఎలా రక్షిస్తారు?

మనదేశంలో 5-14 వయస్సు వున్న బాలకార్మికులు 1,01,28,663 మంది (12 శాతం) వున్నారు. ప్రపంచంలో ఎక్కువ బాలకార్మికులు వున్న దేశం మనది. గ్రామీణ ప్రాంతంలో చాలా ఎక్కువగా 81,02,341 మంది, పట్టణ ప్రాంతంలో 20,26,322 మంది బాలకార్మికులు ఉన్నారు. బాలకార్మికులు ఎక్కువగా వున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ది 4వ స్థానం. మొదటి స్థానం ఉత్తరప్రదేశ్‌ది. బాలకార్మికులు అంతా బడి బయట ఉన్నవారే. బడిలో లేరంటే బాలకార్మికులని నిర్ధారణ చేసుకోవచ్చు. బాలకార్మికుల బాధలేమిటో, ఎలా జీవిస్తున్నారో, వీరి ఆకాంక్షలేమిటో చూద్దాం. పరిష్కారం కూడా అక్కడే కనిపిస్తుంది.

**దీపా (12 సం॥లు):** నేను బడికి వెళ్ళలేదు. రెండు ఇళ్ళలో అంట్లు తోమేపని, ఇల్లు శుభ్రంచేసే పని చేస్తుంటాను. ఉదయం 6.30 ఇంటినుండి కదిలి 11 గం॥లకు వస్తాను. తిరిగి 3 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు ఆ ఇళ్ళల్లో పనిచేస్తుంటాను. నెలకు రు.1100/- సంపాదిస్తాను. నాకోసం రు.50/- ఖర్చు చేస్తుంటాను. బడికి వెళ్ళాలని నా కల.

**మొహబూబ్ (11 సం॥లు):** సిల్క్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాను. ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 7 గం॥ వరకు పని. మధ్యలో ఒక గంట భోజన విరామం. అన్ని రోజులూ ఇదేపని. కొత్తగా నేర్చుకొనేది ఏమి వుండదు. నెలకు రు.2000/- ఇస్తారు. నాతోపాటు అహమ్మద్(12), రిజ్వాన్(11) పనిచేస్తుంటారు. నాకు చదువుకొనే అవకాశం లేదు. మేం పేదవాళ్ళం.






**సాహిర్(12 సం॥లు):** టీ షాపులో పని. ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 7 గం॥ వరకు గ్లాసులు కడగడం, బల్లలు శుభ్రం చేయడం చేస్తాను. ఆదివారం కూడా సెలవు లేదు. మధ్యలో కస్టమర్లు రాని టైంలోనే తీరిక. మా యజమాని బడికి పంపుతానంటున్నాడు. ఎప్పుడా అని ఎదురుచూస్తున్నాను.

**నరేంద్ర (12 సం॥లు):** నేను ఒక కాంట్రాక్టరు దగ్గర పనిచేస్తుంటాను. రోజుకు రు.60/- ఇస్తాడు. తరచు కొడుతుంటాడు. మా అమ్మవాళ్ళకు నన్ను పనికి పంపడం ఇష్టం లేదు. మేం పేదవాళ్ళం. ఏం చేస్తాం? బడికి వెళ్ళాలని వుంది. నా తమ్ముళ్ళు అయినా బడికి వెళ్ళేటట్లు చేస్తాను.

**బిపిన్ (8సం॥):** పంట చేలల్లో పశువుల వెంట నడిచినడిచి కాళ్ళకు చీరుకు పోయిన గాయాలు. కాళ్ళకు ప్లాస్టిక్ తాళ్ళతో కట్టివున్న స్లిప్పర్లు. భారతీయ బాధల బాల్యానికి సంకేతంగా కనిపిస్తాడు బిపిన్. ఆ పశువులు ఊర్లోవారివి. వాటిని మేపడం ద్వారా నెలకు రు.1000/- సంపాదిస్తాడు. "నేనీపని చేయకపోతే మా కుటుంబం సరిపడా తిండి తినలేదు. మా అన్న అరవింద్ (13) కూడా వ్యవసాయం పనులకు వెళతాడు. తమ్ముడు, చెల్లెలు ఇంట్లో వుంటారు సాయంత్రం ఒక గంట వుంటుంది ఆడుకోవడానికి. ఒక్కోసారి ఆడుకోవాలనిపించదు. పెదరాళే నిద్రపోతాను".



**హానిఫ్(10సం॥):** ప్లాస్టిక్ ఏరుతాడు. ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6.30 వరకు గోడల ప్రక్కన, చెత్తకుండీల దగ్గర ప్లాస్టిక్ ఏరుతాడు. తండ్రి చనిపోయినందున 5 వ తరగతి డ్రాప్ అవుట్. "నాకు చదువుకోవడం ఇష్టం. ఇంగ్లీషు, లెక్కలు నాకు ఇష్టమైన సబ్జెక్టులు"

**శీలాకుమారి(10 సం॥):** స్టోన్ క్రషింగ్ మిషన్ దగ్గర ముఖానికి టవలు చుట్టుకొని పనిచేస్తూ వుంది. తానిప్పుడు 5వ తరగతి చదువుతూవుంది. ఒకవారం నుండి ఈ పనిలో వుంది. "గుడ్డలు కొనుక్కోవడానికి ఇక్కడ పనిచేస్తున్నాను. వారానికి రు.600/- ఇస్తారు. ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 5.30 వరకు పనిచేయాలి. దుమ్ముతో ఒక్కోసారి ఊపిరాడదు."

బడికి వెళ్ళాలనుకోవడం వీళ్ళకోరికే కాదు కర్కశమైన బాలకార్మిక జీవితానికి ఒక పరిష్కారం కూడా. నిర్బంధ విద్య పటిష్టంగా అమలు చేయడం ద్వారా సామాజిక సమస్య పరిష్కరింపబడుతుంది. మనదేశంలాగే వలస విముక్తి పొందిన దక్షిణ కొరియా, తైవాన్ లాంటి దేశాలు, జపాన్, జర్మనీ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు నిర్బంధ విద్య పటిష్టంగా అమలు చేయడం ద్వారా ఎలా బాలకార్మికతను రూపుమాపాయో, ఎలా ప్రగతి సాధించాయో చూస్తే మనం ఎక్కడ వున్నామో అర్థమౌతుంది.

**దక్షిణ కొరియా:** ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థలో ఒకటి. మనకంటే రెండేళ్ళముందు స్వాతంత్ర్యం పొందింది. విద్యావ్యాప్తికి విపరీతంగా ఖర్చుచేసింది. విద్యకై ఈ దేశం చేస్తున్న సరాసరి ప్రభుత్వ ఖర్చు 24.98%. 1970 నాటికే 99% పిల్లలు బడిలో వుండేవారు. మనదేశంలోలాగా ఉత్తుత్తి చదువులు కాకుండా వొకేషనల్ కోర్సులు ప్రవేశపెట్టింది. దీంతో నైపుణ్యం గల వారు తయారైనారు. తద్వారా అద్భుత పారిశ్రామిక ప్రగతి సాధించింది. తలసరి ఆదాయం 25,782 డాలర్లు, అమెరికా కంటె ఎక్కువ. దాదాపుగా పేదరికం పోయింది, బాలకార్మికతా పోయింది.

**తైవాన్:** 1945లో వలస విముక్తి పొందింది. ప్రాథమిక విద్యకై అధిక ఖర్చు చేసింది. నిర్బంధ విద్యను పటిష్టంగా అమలు చేసింది. 1979 నాటికే 96% అక్షరాస్యత సాధించింది. పారిశ్రామిక ప్రగతి సాధించింది. బాలకార్మికతను గణనీయంగా తగ్గించింది. ఈ దేశం తలసరి ఆధాయం (21,448 డాలర్లు) పెరిగి పేదరికం తగ్గింది.


**చైనా:** 1949లో సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడేనాటికి అక్ష్యరాస్యత 20% మాత్రమే. చదువును నిర్బంధం చేశారు. అంతరాలు తొలగించడానికి విద్యకీలక అవసరమని పాలకులు భావించారు. ప్రభుత్వ ఖర్చులో 14% పైన విద్యకు కేటాయించారు. ఇక్కడ పిల్లల్ని బడికి పంపడం పట్ల తల్లిదండ్రులకు ఎలాంటి బాధ్యత వుండదు. అది ప్రభుత్వ బాధ్యతగా వుంటుంది. ఎక్కువ జనాభా రీత్యా తక్కువ తలసరి ఆధాయం వున్నా విద్యలో ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థలలో ఒకటిగావుంది. ఇక్కడ బాలకార్మికులను వినియోగించే పరిశ్రమలకు ముడిసరుకు నిలిపేస్తారు. అటువంటి పరిశ్రమల లైసెన్సులు రద్దుచేస్తారు, జప్తుచేస్తారు.

**జర్మనీ:** 15 సం॥పైన వయస్సు వారికి నిర్బంద విద్య పూర్తిచేసిన సర్టిఫికేట్ ఉంటేనే ఏదైనా పని దొరుకుతుంది. పాకెట్ మని కోసం 13 సం॥ నుండి 15 సం॥ మధ్య వాళ్ళకు కొన్ని షరతులతో మాత్రమే పనిచేయడానికి అనుమతి వుంటుంది. షరతులు ఏమంటే బడి జరిగే టైంలో వీరు పనిచేయకూడదు, 2 గంటల కంటె ఎక్కువ పనిలో వుండకూడదు. పనులు ఏమంటే న్యూస్ పేపర్లు వేయడం, తోటపని, ఇంటిపని, పిల్లల్ని చూచేపని, ప్రైవేటు చెప్పడం, షాపుకెళ్ళి వస్తువులు తేవడం, కూరగాయలు అమ్మడం.

**జపాన్:** 15 సం॥లోపు వారు పనిచేయడానికి నిషిద్ధం. అందరికీ 9 సం॥ల విద్య కంపల్సరీ. పిల్లలందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ వుంటుంది. 15 సం॥వారు ఎవరైనా పనిచేయడానికి సిద్ధపడితే దానివెనుక కారణాలు చూస్తారు. పెద్దలకు ఉపాది కల్పించి పరిష్కరిస్తారు. బడిలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకూ ఈ మధ్య ఒక స్పెషల్ డ్రైవ్ మొదలు పెట్టారు.

**ఫిన్‌లాండ్:** ప్రపంచంలో అత్యుత్తమ విద్యావ్యవస్థ ఇక్కడవుంది. ఒక్క బాలకార్మికుడు లేదు. ఇంటిపనులకు సంబంధించి గానీ, వీధి బాలలు గానీ లేరని ప్రకటించినారు. పిల్లల తరలింపు అసలులేదు. పటిష్టమైన విద్య వల్లే ఇది సాధ్యమైంది.

ఈ అనుభవాలు మన పాలకులకు కనబడవా? మనదేశ బాల్యపు ఆక్రందనలు వీరికి వినబడవా? **"మనసుంటే మార్గం వుంటుంది" మరి మన ప్రభుత్వానికి మనసుందా?**



# నోబెల్‌శాంతి బహుమతి విజేతలకు అభినందనలు

బాలల హక్కుల కోసం, బాలికా విద్య కోసం పోరాడుతున్న ఇద్దరు విశిష్ట వ్యక్తులకు నోబెల్ శాంతి పురస్కారం లభించింది. అందులో ఒకరు మన దేశానికి చెందిన బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన పోరాట యోధుడు కైలాశ్ సత్యార్థి.... మరొకరు పాకిస్తాన్‌లో బాలికల విద్య కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ధీశాలి మలాలా యూసఫ్ జాయ్. దేశంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా విశేష కృషి సల్పిన సత్యార్థి బచపన్ బచావో ఆందోళన ద్వారా దేశంలో బాలకార్మిక వ్యవస్థపై యుద్ధం ప్రకటించారు. ఆయన కృషితో దాదాపు 80వేలమంది చిన్నారులు కార్ఖానాల్లో వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందారు. అమ్మాయిలు స్కూళ్లకు వెళ్లరాదని హుకుం జారీచేసిన తాలిబన్లను ధిక్కరించి, బాలికల విద్య కోసం ఉద్యమించిన క్రమంలో తూటాలు ఎదుర్కొన్న మలాలా మొక్కవోని పట్టుదలతో కోలుకొని, తన పోరాటాన్ని విశ్వవ్యాప్తం చేసింది. వీరిద్దరి కృషికి గుర్తింపునిచ్చిన నోబెల్ పురస్కారాల అకాడమీ ఈ యేడాది నోబెల్ శాంతి బహుమతిని వారికి సంయుక్తంగా ప్రకటించింది. ఇది మన దేశానికి లభించిన రెండో శాంతి పురస్కార మైనప్పటికీ, పుట్టుకతో భారతీయుడిగా ఈ పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిగా సత్యార్థి రికార్డు సృష్టిస్తే, అత్యంత పిన్న వయసులో అత్యున్నతమైన నోబెల్ పురస్కారం అందుకున్న బాలికగా మలాలా మరో రికార్డు నెలకొల్పింది.

బాలల హక్కుల పరిరక్షణ కోసం దాదాపు మూడున్నర దశాబ్దాలుగా అలుపెరగని పోరాటం చేస్తున్న కైలాష్ సత్యార్థి 1954 జనవరి 11న మధ్య ప్రదేశ్‌లోని విదిశలో జన్మించారు. విదిశలోని సామ్రాట్ అశోక్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో సత్యార్థి ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కొన్నాళ్లు ఉద్యోగం చేసి, తర్వాత సామాజిక సేవకు అంకితమయ్యారు. విద్యార్థి దశనుంచే ఆయన చిన్నారులకు విద్య, బాలల హక్కుల గురించి పోరాటం సాగించారు. చదువుకోవాల్సిన వయసులో పనిచేసే బాలలకు సహాయపడేందుకు వీలుగా 11యేళ్ల వయసులో ఒక ఫుట్‌బాల్ క్లబ్ స్థాపించి, దాంట్లో సభ్యులుగా చేరేవారి నుంచి వసూలు చేసే సొమ్మును పేద బాలల స్కూల్ ఫీజు కొరకు ఇచ్చేవారు. తన స్నేహితుడు రమేశ్ వ్యాస్‌తో కలిసి పరీక్షలు ముగియగానే పుస్తకాలు సేకరించి, ఉపాధ్యా యుల సహకారంతో విద్యార్థులకు ఇచ్చేవారు. ఇలా చిన్న వయసు నుంచే బాలల విద్యకు ఎంతగానో కృషి చేసిన సత్యార్థి తన 26వ యేట 1980లో బచపన్ బచావో ఆందోళనను చేపట్టి సుమారు 80వేలమంది బాలలను వెట్టిచాకిరి నుంచి విముక్తి కలిగించారు. సత్యార్థి ఆలోచనల నుంచి పుట్టిన మరో శక్తివంతమైన ఆయుధం 'రగ్‌మార్క్' వివిధ కంపెనీల్లో తయారైన కార్పెట్లు విదేశాలకు ఎగుమతి చేసేటప్పుడు వాటిని బాలకార్మికులు తయారు చేయలేదన్న ధృవీకరణే 'రగ్‌మార్క్'! ఇది దేశంలోనే కాకుండా ప్రపంచ స్థాయిలో బాలల హక్కుల అంశంపై చైతన్యం కలుగజేసింది. ఇప్పుడు అది 'గుడ్‌వీవ్'గా అమల్లో ఉంది. 1998లో సత్యార్థి చైర్మన్‌గా బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక ప్రపంచ పర్యటన దాదాపు 60 దేశాల్లో సాగింది. ఆ మరుసటి సంవత్సరం బాల కార్మిక వ్యవస్థపై ఐఎల్‌వో ఒక ఫర్మానా జారీ చేసింది.

చిన్నారుల అక్రమ రవాణాను నిరోధించి వారి హక్కులను పరిరక్షించారు. పేదరికం, జనాభా పెరుగుదల, నిరుద్యోగం, నిరక్ష రాస్యతలు ప్రధాన ఎజెండాగా సత్యార్థి ఉద్యమం చేపట్టారు. గ్లోబల్ మార్చ్ ఎగైనెస్ట్ లేబర్ చైల్డ్‌లోనూ ఆయన పాల్గొన్నారు. సత్యార్థి పోరాటాలకు అమెరికా, స్పెయిన్, జర్మనీలతోపాటు పలు దేశాల నుంచి అవార్డుల రూపంలో గుర్తింపు ప్రోత్సాహం లభించాయి. 2009లో డిఫెండర్స్ ఆఫ్ డెమోక్రసీ అవార్డ్‌ను అందజేసి, ఆయన స్ఫూర్తిని అమెరికా గౌరవించింది. ఇటలీ 2007లో తన దేశంలోనే ప్రఖ్యాత పురస్కారమైన మెడల్ ఆఫ్ ఇటాలియన్ సెనెట్‌ను అందించింది. రాబర్ట్ ఎఫ్ కెన్నడీ అంతర్జాతీయ మానవ హక్కుల అవార్డు (అమెరికా), ఫ్రెడరిక్ ఎబెర్ట్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అవార్డు (జర్మనీ) లాంటి అనేక పురస్కారాలు ఆయనకు లభించాయి.


ఉగ్రవాద ప్రాబల్య ప్రాంతమైన స్వాత్ జిల్లాలో తాలిబన్లు బాలికల విద్యపై నిషేధం విధించగా, పాకిస్తాన్ బాలికల దుస్థితిని బీబీసీ బ్లాగు ద్వారా మలాలా ప్రపంచ దృష్టికి తెచ్చారు. దీనిపై కన్నెర్ర చేసిన తాలిబన్లు 2012 అక్టోబర్ 9లో ఆమెపై తూటాలు కురిపించారు. సహచర విద్యా ర్థినులతో కలిసి పాఠశాలకు వెళ్తున్న మలాలా వాహనాన్ని తాలిబన్లు అడ్డుకొని తుపాకీ ఎక్కుపెట్టి మలాలా ఎవరు? అని ప్రశ్నించినప్పుడు నేనేనంటు ముందుకు వచ్చి తూటాలకు ఎదురొడ్డిన మలాలా ధైర్యానికి ప్రపంచమే సలాంకొట్టింది. "నా గమనాన్ని మార్చి గమ్యాన్ని మళ్ళించి దారికి తెచ్చుకుంటామని ఉగ్రవాదులు ఆలోచిస్తున్నారు. కాని దాడి తర్వాత నేను మళ్లీ పుట్టాను, నాలోని భయం, బలహీనతలు, నిరాశ నిస్పృహలు ఆ క్షణాన్నే చచ్చిపోయాయి. నాలోని సంకల్ప శక్తి, సాధనా సామర్థ్యం పునరుజ్జీవం పొందాయి. నాకు ఏ ఉగ్రవాద సంస్థపై కోపం లేదు. నిజానికి ఉగ్రవాదుల పిల్లలూ చదువుకోవాలి. అప్పుడిక ఉగ్రవాద సమస్యే ఉండదు" అంటూ తొలుత ఐక్యరాజ్య సమితిలోనూ తర్వాత హార్వర్డ్ యూనివర్సిటీల్లో ప్రసంగించారు. ఆమె జన్మదినం జులై 12ను మలాలా డేగా ఐరాస ప్రకటించింది. ప్రపంచ కవి సమ్మేళనాన్ని 2013లో మలాలా పేరుతో అర్జెంటినాలో నిర్వహించారు. పాక్‌లో మూడో అత్యున్నత పౌరపురస్కారం 'సితారె ఘుజాత్'ను 2012లో అందుకున్నారు. శాంతి సాధకురాలిగా గుర్తించి ఇటలీ ప్రభుత్వం సత్కరించింది. అంతర్జాతీయ చిన్నారుల శాంతి అవార్డుకు ఆమె నామినేట్ అయింది. ఎంత బతికామనేది కాదు, మనిషిగా ఎంత జీవించామనేది ముఖ్యం. ఆశయాల రాపిడిలో ఊపిరిని సైతం వదిలేందుకు సిద్ధంగా ఉన్నామా లేదా అనేది ప్రధానం. కత్తికన్నా వాడిగా లక్ష్యంవైపు చూపును సాధించగలమా లేదా అనేదే కీలకం. ఈ లక్షణాలన్నీ ఒక్కచోట పోస్తే ఆ రూపమే మలాలా యూసఫ్ జాయ్.



జి. ఉషాదేవి

భారత్-పాక్ దేశాల్లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని నోబెల్ శాంతి పురస్కార విజేతలు కైలాశ్ సత్యార్థి, మలాలా యూసఫ్ జాయ్ ప్రకటిస్తూ, నియంత్రణ రేఖవద్ద ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో రెండు దేశాల మధ్య బలమైన సంబంధాలు నెలకొల్పేందుకు సంయుక్తంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఒక భారతీయుడు, ఒక పాకిస్థానీ అందులోను ఒకరు హిందువు, ఒకరు ముస్లిం, విద్య కోసం ఉమ్మడిగా ఉద్యమిస్తూ తీవ్రవాదంపై పోరుసల్పుతూ శాంతి స్థాపనకు మరియు బాలల హక్కుల సాధనకై కలిసి అడుగులు వేయబోతున్న సామాజిక ఉద్యమకారులు కైలాశ్ సత్యార్థి మరియు మలాలా యూసఫ్ జాయ్‌లకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) అభినందన మందారాలు అందజేస్తుంది.

# ఉద్యోగుల ఆరోగ్య పథకం నవంబర్ 1 నుండి ప్రారంభం




**ఐ.వెంకటేశ్వరరావు**
జెఏసి సెక్రటరీ జనరల్

1999 పేరివిజన్ కమిషన్ ఉద్యోగులకు మెడికల్ అలవెన్సు నెలకు రు.90/–లు చెల్లించాలని, హెల్త్ ఇన్సూరెన్సు స్కీము అమలు చేయాలని సిఫారసు చేసింది. అయినా ఆ పథకం అనేక కారణాల వలన అమలులోకి రాలేదు. నాటి నుండి అనేక ప్రయత్నాలు జరిగాయి.

2009లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వలె రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా హెల్త్‌కార్డులు యివ్వాలని నాటి జె.ఎ.సి. ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేసింది. 02.09.2009న జరిగిన మొదటి సమావేశంలో ప్రభుత్వం తన ప్రతిపాదనలు రాష్ట్ర జె.ఎ.సి., ముందుంచింది. నాటి నుంచి రాష్ట్ర జె.ఎ.సి. ప్రభుత్వ ప్రతినిధుల మధ్య సుమారు 30 సమావేశాలు జరిగాయి. 2 లక్షల సీలింగ్ ఎత్తివేయాలని, ఎయిడెడ్, మున్సిపల్, గురుకుల, ప్రభుత్వరంగ సొసైటీ తదితర ఉద్యోగులకు వర్తింపచేయాలని, ఔట్‌పేషెంట్ విభాగంలో ఉచిత వైద్యం కావాలని, ప్యాకేజి రేట్లు పెంచాలని, ట్రస్టులో జె.ఎ.సి. కోరిన మేరకు ప్రాతినిధ్యం ఉండాలనే దానిపై ప్రధానంగా చర్చలు జరిగాయి.

ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు 134,135 ఉత్తర్వులు 29.10.2014న ప్రభుత్వం విడుదల చేసింది. అక్టోబర్ 30వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రవీంద్రభారతి హైదరాబాద్‌లో ఈ పథకాన్ని ప్రారంభించారు. వైద్య ఆరోగ్య శాఖామాత్యులు కామినేని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. దేశంలోనే ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రారంభిస్తున్న గొప్ప పథకంగా అభివర్ణించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి ఎల్.వి.సుబ్రమణ్యం, ఆరోగ్యశ్రీ సి.ఇ.ఓ. ధనంజయ్‌రెడ్డి సందేశాలు యిచ్చారు. జె.ఎ.సి. ఛైర్మన్ అశోక్‌బాబు మాట్లాడుతూ పథకం ప్రారంభంపట్ల హర్షం ప్రకటిస్తూ సారధ్య సంఘంలో ఉద్యోగ సంఘాల ప్రాతినిధ్యం పెంచాలన్నారు. పి.ఆర్.సి. నివేదికను బయట పెట్టి వెంటనే అమలు చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మురళీకృష్ణ మాట్లాడుతూ కార్పోరేట్ అసుపత్రులన్నింటిలో ఈ వైద్యం అందేలా అనుమతించాలన్నారు. జె.ఎ.సి. సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 1999లో ఉద్యోగులకు ఆరోగ్యభీమా, మెడికల్ అలవెన్సుపై ప్రారంభ చర్చ జరిగిందని, 15 సం॥ తర్వాత ఈ పథకం అమల్లోకి వచ్చిందని అన్నారు. ప్రభుత్వం కొందరు (ఎయిడెడ్, గురుకుల, ప్రభుత్వ రంగం, సొసైటీ, గ్రంథాలయ) ఉద్యోగుల పట్ల వివక్షత చూపించడం సరికాదన్నారు. రెండోదశలో వీరికి ఆరుమాసాలు అనిగాకుండా వారిని కూడా త్వరలో ఈ పథకంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సమానంగా వర్తింపచేయాలన్నారు. అదేవిధంగా ఎయిడెడ్, గురుకుల, ప్రభుత్వ రంగ, సొసైటీ, గ్రంథాలయ తదితర ఉద్యోగులకు 60 ఏళ్ళ రిటైర్మెంట్ వయస్సు పెంపుఉత్తర్వులు వెంటనే వర్తింప చేయాలన్నారు. వీరు గత ఐదు నెలలుగా జీతాలు లేక, పెన్షన్ రాక ఎలా బ్రతకాలోమీరే చెప్పాలన్నారు. కో ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ పథకం సక్రమంగా అమలయ్యేటట్లు చూడాలని చెప్పి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ హుద్‌హుద్ తుపాను సహాయక చర్యలలో ఉద్యోగుల సేవల అభినందనీయమని, కొంత సమయం యిస్తే ఏ రాష్ట్ర ఉద్యోగికి లభించని గౌరవం యిప్పిస్తానని. ఆదునిక పరిజ్ఞానంతో పనిచేయాలని, 22 లక్షల మందికి ఆరోగ్య భద్రత కల్పించామని అన్నారు. 10వ వేతన సవరణ నివేదికను పరిశీలించి అమలు చేయుటకు రెండు రోజుల్లో మంత్రుల కమిటీ వేస్తామని ఈ కమిటి రాష్ట్ర జె.ఎ.సి.తో చర్చిస్తుందని తదుపరి అమలుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

ఇప్పటికే విడుదల చేసిన తాత్కాలిక హెల్త్‌కార్డులను గతంలో విడుదల చేసిన వారందరికీ శాశ్వత హెల్త్‌కార్డులుగా మార్పు చేయడమైనది. మున్సిపల్ టీచర్లందరూ ఆ మేరకు నవంబరు 2014 నుండి రికవరీలు చేయాల్సి ఉంది. హైదరాబాద్‌లోని అపోలో, కిమ్స్, యశోదా ఆసుపత్రులు ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలుకు తమ ఆమోదం తెలుపలేదు. ఇతర రాష్ట్రాల ఆసుపత్రులు తమ ఆమోదం తెలిపితే హెల్త్‌కార్డుల ద్వారా లేకపోతే ఆ ఆసుపత్రులలో చేయించుకున్న వైద్యానికి రియింబర్స్ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగులైన భార్యాభర్తలకు వారితల్లిదండ్రులకు హెల్త్‌కార్డుల అమలుకు ఇద్దరూ ప్రీమియం చెల్లించాలనేదానిపై క్లారిటీ యివ్వాల్సి ఉంది. ఉద్యోగిని భర్త నిరుద్యోగి అయినపుడు ఆమె అత్తమామలను ఆధారితులుగా గుర్తించాలనే దానిపై క్లారిటీ యివ్వాల్సి ఉంది. ఆధారిత పిల్లలకు 25 సం॥లు వరకే ఈ హెల్త్‌కార్డులు వర్తింపచేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న ఆధారిత పిల్లలకు వయస్సుతో సంబంధం లేకుండా హెల్త్‌కార్డులు వర్తింప చేయాల్సి ఉంది. జిఓలు విడుదల చేసినప్పటికి ఆసుపత్రులకు కమ్యూనికేట్ కాకపోవడంతో కొన్ని ఆసుపత్రులు సమాచారం లేదని వైద్యం అదించలేదు. ఆరోగ్యశ్రీ సి ఇఓ ధనంజయ్‌రెడ్డిగారితో మాట్లాడగా నవంబర్ 11,12 తేదీలలో ఆంధ్ర ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి తగు ఆదేశాలు యిస్తామన్నారు. ఈ పథకం అమలులో అనేక కొత్త సమస్యలు వెలుగులోకి రావచ్చును. ఉద్యోగుల ఆరోగ్య పథకం ట్రస్టు ఈ సమస్యలన్నింటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాల్సివుంది.

కథలు, కవితల పోటీలలో
ద్వితీయ బహుమతి అందుకున్న కథ

# రాజీ ప(బ)డి



పురిమళ్ల సునంద

"రాజీ! ఓ రాజీ! "ఎక్కడ సచ్చావే?" పోరదు గుక్క బట్టి ఏడుత్తుంటే యినబడట్లేదానే!" గావు కేకలు పెడుతూ మద్దె మద్దెలో సంటోన్ని బతిమిలాడుతూ దగ్గరికి రమ్మంటున్నది మల్లమ్మ.

"ఒరేయ్!" ఇటు రారా!" రమ్మంటే రాడు నట్టింట్లో కూకొని ఆరున్నోక్క రాగాలు తీత్తున్నడు" "పోరి సెవుల్ల సీసం పోసుకుందా ఏటి?" ఎన్ని మార్లు పిల్సినా ఊ అనదు ఆ అనదు . " ఓ పోరీ! ఒసే రాజీ! తోరగా రాయే పోరదు గుక్క పట్టిండు" కుక్కి మంచంలో కూసున్న మల్లమ్మ గొంతు చించుకొని అరుస్తున్నది.

"ఒరేయ్ నాయినా! గిటుదార! మయ్యగని రారా!" అన్నా కొద్ది అటు, యిటు దిక్కులు చూస్తున్న సంటోడు ఏడ్పు మరింత ఎక్కువ చేసిండు.

నాయినమ్మ అరుపులు, సంటోడి ఏడుపు విన్న రాజి ప్లాస్టిక్ టబ్బు గోళెం దగ్గర పడేసి ఉరికొచ్చింది. చేతులు సాపి సంటోన్ని ఎత్తుకొని కళ్ళు తుడిచింది. అప్పటికి గాని ఆడు ఏడ్పు, ఎక్కిళ్ళు ఆపలేదు.

"గింత సేపు యాడబోయినవే?" సంటోడు అదే పనిగ ఏడ్వబట్టె, ఎంతూకించినా ఊకోడయ్యె!. నిన్నే అడుగుతుండ? మూగి ముంగిసలాగ ఉలకవేమె తిట్లు లంకించుకుంది మల్లమ్మ. "గాతిట్లకు రోషంగా నాయినమ్మ వైపు చూస్తూ "నీ ఉచ్చే పారబోయనీకి బోయిన" సుట్టుపక్క నోల్లు ఆసవనోత్తుందని తిడుతుంటే దూరంగా పోసిరావడానికెళ్ళిన" అంది రాజి.

ఆ "మాటలకు గుమ్మడికాయల దొంగలా భుజాలు తడుముకుంటూ "గది కాదే రాజీ! నేనేమో గిందులోంచి లెయ్యలేనైతి. ఆడేమో గుక్కబట్టి ఏడ్వబట్టె, రమ్మంటే రాడయ్యె". ఏడ్చేడ్చి గాని గొంతెక్కడ తడారిపోద్దోనని బయమేసి పిల్సిన" అని నసిగింది మల్లమ్మ.

గీ ముసల్డి గా సంటోడు ఎప్పుడూ జర్రన్న మెసలనీయరు. పొద్దత్తమానం సేత్తున్నా ఎప్పుడూ తిట్లూ దీవెనెలె, కళ్ళు తుడ్సుకుంటు పాలగిన్నెలో పాలు గిలాసల పోసుకొచ్చి సంటోడికి తాపింది రాజి.

కాలు విరిగిన నాయినమ్మ, యింకా నడవడం రాని సంటోడు రాజి మెడకు గుదిబండల ఒక్క క్షణం ఒంటరిగ ఉండనీయరు.

కూసుంటే లేవనేని, లేత్తే నడ్వలేని నాయినమ్మకు అన్నీ మంచంలోనే. ఇక సంటోడైతే ఏ ఐదారునెల్లు అమ్మ కాడున్నడో! పాలు మరిపిచ్చి కూలికిపోతున్న కానించి, రేయీ పగలూ ఆడి ఆలనంతా రాజీదే!

"అలాగని రాజి ఏ పదారేళ్ళ పిల్లగాదు, నిండా పదేళ్ళు కూడా లేని పసికూన. బాల్యం అంటే తెలియని చిన్నారి. పని భారం మోస్తున్న చిరు మెగ్గ" ఇద్దరక్కలు, అమ్మ, అయ్య కూలికి పోతే ఇల్లుగాపెట్లుకొని యిద్దర్నీ సవరిచ్చేది తనే.

రాజి దిన చర్య పొద్దున్నే అక్కలతో పాటు లేవడం. అక్కలు ఇల్లు ఆకిలి ఊడుస్తుంటే, సితుకులు ఏరుకొచ్చి పొయ్యి రాజేయడం. తనతో పాటే లేసే తమ్ముణ్ణి ఒళ్ళో కూసో బెట్టుకొని ముచ్చట్లు చెప్పడం. ఆడికి అక్కే సర్వస్వం. తినిపించాలన్నా, తాగించాలన్నా(బువ్వ తినిపించాలన్నా) అంతా 'రాజీనే' చేయాలి. అక్కలు పిలిస్తే సూత్తడు గని ఎవ్వరి దగ్గరికి బోడు, ఆడిని మోసీ మోసీ 'రాజి' చేతులు నెప్పెడుతుంటాయి. ఒక్క నిమిషం దింపిందా.... యిగ తెరిసిన నోరు ముయ్యడు. గా ఏడుపు ఆపేసరికి తాతలు దిగొస్తారు రాజికి.

మల్లవ్వ కాలిరిగి ఏన్నర్థం అయ్యింది. పసరు కట్టు కట్టించి, మోటు వైద్యం చేయించేసరికి యిరిగిన సోట సరిగా అతుకోలేదు. నడ్వరాకుంట మంచానికే అంకితమయ్యింది. ఒంటికి పోవాలన్నా, రొంటికి పోవాలన్నా అన్ను అందులోనే.... ఆమెకు చాకిరి చేసే తీరిక ఎవ్వరికీ లేదు. రెక్కాడితే గానీ డొక్కలు నిండని యిల్లది. అంత మంది తిండి తిప్పలు జరగాలంటే ఇంట్లో అంతా పని చేయాల్సిందే. అందుకే ఇంటి బాధ్యత అంతా చిన్నారి రాజి మీదనే వేసి పోతారు.

మల్లమ్మకు పొద్దున్నే గిన్ని చాయ్ నీళ్ళు కడుపులో పడకపోతే అల్లడం, తల్లడం అవుతుంది. ఆళ్ళందరితో పాటే తాగాలంటది. ఆళ్ళ పనులతో పాటు తన పనులూ కానిచ్చుకోవాలని చూస్తది!.

అందుకే పొద్దున్నే తలో చేయ్యేసి ఆ మంచాన్ని లేపుకొచ్చి బయటేస్తారు. పందుం పుల్ల, చెంబులో నీళ్ళు, ఊయడానికి కావలసిన బకెట్టు 'రాజి' తెచ్చి పెడితే, ముఖం కడుక్కొని ఆళ్ళతో పాటు చాయ్ తాగుతుంది. ఆళ్ళున్నప్పుడే ఒంటి మీద గిన్ని నీళ్ళు పోసుకొని తానం చెయ్యాలని తహతహలాడుతుంది.

మంచంలో పడే వరకు పులిలా బతికిన నాయినమ్మంటే ఇంట్లో అందరికీ భయమూ భక్తి. (యిద్దరి మనుషుల కష్టం ఒంటి చేత్తో చేసేది మల్లమ్మ.) పొయ్యికుండలో నీళ్ళు పెట్టించుకొని సుట్టూ తెరలాగా పట్టుకుంటే తానం చేసి మనవరాళ్ళతో సీర కట్టించుకొని మంచం లోపలేయించుకుంటుంది. మళ్ళీ తెల్లారే దాక మల్లమ్మకు గా గుడిసే ప్రపంచం.

సద్దులు కట్టుకొని ఎటోళ్ళటు వెళ్ళాక అసలు పనుంటుంది రాజికి. సంటోడిని నిదరబుచ్చి అంట్లు తోముతుంది. బట్టలుతుకుంది. దగ్గర్లో ఉన్న బోరింగ్ కానించి నీళ్ళు మోసుకొచ్చి గోళాలు(గాబులు), కుండలు మొత్తం నింపుతుంది. ఈ లోపు సంటోడు లేచాడా వాడ్ని సంకనేసుకోనే పనులు చేస్తుంటుంది. వయసుకు మించిన పనులు చేస్తున్న 'రాజి'ని చూసి తను పిల్లలను గద్దాయిస్తుంటారు. గా 'రాజి'ని చూసి నేర్చుకోండి. ఆరిందలా ఎన్ని పనులు సేత్తుందో" అంటుంటారు చుట్టు పక్కన గుడిసెలోల్లు.

రాజికి నాయినమ్మ, సంటోడు తప్ప వేరే లోకమే లేదు. ఆటలు పాటలన్నీ ఆ చిన్నోడితోనే. బోరింగ్ కాడ తనీడు పిల్లలు కలిస్తే మాట్లాడుద్ది. ఆళ్ళెప్పుడన్నా గుడిసెకాడి కొచ్చినా, తనెప్పుడన్న ఎల్లినా నాయినమ్మ బండ బూతులకు బలి కావల్సిందే. అందుకే తనూ ఎటూ వెళ్ళదు. సోపతి గాండ్లు ముసల్దాని మాటలకు భయపడి యింటాంకెలకు అస్సలు రారు.

అప్పుడప్పుడు బందులని, ధర్నాలని ఇంట్లో వాళ్ళు పనికి పోని రోజు 'రాజి'కి పండగలాగుంటుంది. ఆ రోజులప్పుడు పెద్దోళ్ళే యింట్ల పనులన్నీ సక్కబెట్లుకుంటారు. ఆళ్ళందరిలో తముడూ పెద్దగా అల్లరి చేయడు. నాయినమ్మ దగ్గర కూసోని, అమ్మ, అయ్య, అక్కలు లోకంల

ముచ్చట్లు, అక్కల పెండ్లిండ్ల ముచ్చట్లు చెప్పుకుంటుంటే అర్దమయ్యీ కానట్టు ఉంటాయి, రాజికి.

'బోరింగ్ ఎదురుగున్న తలంలో పెద్ద బడి కడ్తున్నరంట' అంది పెద్దక్క.

'బడంటే ఏందక్కా? అమాయకంగా అడిగింది రాజి. 'బడంటే బడే' అక్కడికి నీలాంటి పొల్లగాండ్లు ఒత్తరు. ఆళ్ళకు 'సదువు' చెప్పనీకి పంతులమ్మలు, పంతుళ్ళు వత్తారు! అంది సిన్నక్క

'సదువంటే ఏందక్కా?' 'రాజి'లో కుతూహలం పెరిగింది.

"సదువంటే సదువేనే" అచ్చరాలు, అంకెలు, బొమ్మలు, పాటలు, పద్దాలు నేర్పిత్తరు. అబ్బో యింకా చానా చానా నేర్పిత్తరు బళ్ళో అంది.

"గివన్నీ నీకెట్లా తెల్సక్కా" అక్కవైపు ఆరాధనగా చూస్తూ, ఆసక్తిగా అడిగింది రాజి. మూడు నాలుగెళ్ళ నుండి ఊరికి దూరంగా, అడవికి దగ్గరగా ఉన్న తమ గుడిసెలు అందులోని వాళ్ళు తప్ప మరేం తెలియవు రాజికి.

"పనులకు బోయినపుడు రాంగ బోంగ బోంగ జూత్తున్నానే" అంది. "మరి మనం ఎల్తే మనగ్గూడ గివన్నీ బెబుతారా అక్కా" ఉత్సాహంగా అడిగింది.

ఇగసాలు ముచ్చట్లు, "అది సెప్పుడు సరె, నువ్వడుగుడు సరె" గవన్నీ మన్లాంటోళ్ళకు కాదు లెయ్యె". ఉన్న మారాజులకు గొప్పోళ్ళకు: 'దేనికైనా పెట్టిపుట్టాలే' బతుకు దెరువు కోసరం ఊరూరు తిరిగే మనకు అట్టాంటి అదృట్టం లేదు లేయె" రాజిని దగ్గరకు తోస్కొని తల నిమురుత్తూ అన్నాడు అయ్య.

"గా యీలు పడని ముచ్చట్లు. ఎండమావులకు ఎంపర్లాడటం ఒద్దుగానీ అందరం కల్సి బువ్వ తిందాం రండి పిలిచింది అమ్మ.

ఆ ముచ్చట్లు విన్న దగ్గరి నుండి చిన్నారి 'రాజి' బుర్రలో ఊహలు రెక్కలు కట్టుకొని ఊరించసాగాయి. తనలాంటోళ్ళు ఎళ్ళే బడంట, తను ఎట్టాగైనా ఎల్లాలి. ఏం సెబుతరో యినుకోవాల అనుకుంటూ పడుకున్నది. రాత్రంతా ఆ కలల ప్రపంచంలోనే గడిపింది.

"తెల్లారింది. అంతా మామూలే. ఎవరి పనులకు ఆళ్ళు బోయింద్రు, బోరింగ్ కాడి కెళ్ళినప్పుడల్లా బిల్డింగ్ ఎంత వరకొచ్చిందో చూడటం అది తనకోసమే కట్టిస్తున్నట్లుగా ఊహల్లో తేలిపోవడం. నాయినమ్మ, తమ్ముడు గుర్తు రాంగానే ఉలిక్కిపడటం" ఇలా రోజులు నెలలు గడుస్తుండగానే పెద్ద ప్రహరీ గోడలతో, లోపల పెద్ద పెద్ద గదులతో బడి తయారయ్యింది.

సంటోడికి నడకొచ్చింది. చిన్న చిన్న మాటలొచ్చినయి. అక్కతో బడిదాకా వచ్చి ఆ యిసుకలో ఆడుకోవడం ఆకలి కాగానే అక్క చెయ్యిట్టుకొని యింటికి రావడం వాడికీ అలవాటైంది.

నీళ్ళకోసం వెళ్ళేసరికి బిల్డింగ్ దగ్గరంతా సందడిగా ఉంది. తమ్ముని తీసుకొని అక్కడి దాకా వెళ్ళింది. గేటుకు మామిడి తోరణాలు కట్టారు. పెద్ద పెద్దోళ్ళు వస్సున్నరు. తనలాంటి పిల్లలు, ఆళ్ళ వెనుక పంతులమ్మలు కనబడ్డారు.అంతా అక్క చెప్పినట్టుగానే ఉంది అనుకుని ఓ పక్కకు నిలబడింది రాజి.

పెద్ద సారు మాట్లాడుతూ " ఈ బిల్డింగ్ ఆడపిల్లలకు అన్నీ వసతులతో కట్టబడింది. సదువు రాని ఏ ఆడపిల్లలయినా, మధ్యలో మానేసిన వాళ్ళయినా ఈ కస్తూరిబా గాంధీ విద్యాలయంలో ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా చదువుకోవచ్చు. పుస్తకాలు, బట్టలు, భోజనంతో పాటు మంచి రక్షణ ఉంటుంది. ఇక్కడ టీచరమ్మలు వీళ్ళతో కలిసి మెలిసి చక్కగా చదువు నేర్పుతారు. "ఆడపిల్ల చదువు ఇంటికే కాదు ప్రపంచానికే వెలుగు''. ఆ వెలుగు బాటలో మనమంతా నడవాలంటే మన మధ్యలో ఇంత వరకు బడి మొఖం తెలియని, మధ్యలో మానేసిన ఎవరైనా ఆడపిల్లలుంటే ఇందులో చేర్పించాలి. వారి బంగారు భవిష్యత్తుకు మనం చేయూత నివ్వాలి'' అని ముగించారు. అందులో మొత్తంగా 'రాజి'కి తెలిసింది "తనలాంటి వాళ్ళకోసమే ఆబడి, తను వెళ్ళి ఎంచక్కా చదువుకోవచ్చునని".

"ఇంత ఆలిసమైంది ఎక్కడికెళ్ళావ్" అని గద్దిస్తున్న నాయినమ్మకు విషయమంతా చెప్పింది. తను అందులోకెళ్ళినట్టుగానే ఊహించుకుంటూ "నేనూ బాగా సదువుకుంటా ఆడపిల్ల సదువంట పెపంచానికే ఎలుగంట" అంది రాజి.

"బానే ఉంది కత". "ఉట్టికెగర లేనమ్మ సోర్గానికెగర బోయిందట నీలాంటిదే".... " మనలాంటోళ్ళకు సదువా..... ఏదో గిక్కడ పని దొర్క బట్టి యిప్పటి దాకా గిక్కడున్నం. యిక్కడ పనులయ్యాక పొట్ట సేత బట్టుకొని మరోసోట కెళ్ళేటోళ్ళం మనకెక్కడ గుదురుతుంది" 'అయినా గిప్పుడేం సదువే? రాజును చూసిన కళ్ళకు మొగున్ని చూసి మొత్తుకో బుద్దయిందని' అక్కడ సూసొచ్చిన దగ్గర్నుండి ఒకటే తూగులు తూగుతున్నవ్" అని పాలపొంగులాంటి 'రాజి' ఆశల మీద నీళ్ళు జల్లింది.

ఇంటిల్లి పాదీ అదే మాట అని, చిన్నారి మనసు మీద పెద్దగాయమే చేశారు.

రాజీలో మునుపటి ఉషారు లేదు. పరధ్యానం ఎక్కువైనది. ఏ పని చేస్తున్నా మొక్కుబడిగా తప్ప ఇంతకు ముందులా లేడి పిల్లలా పరుగులు తీయడం లేదు. పొద్దున బోయి రాత్రి కొచ్చే అమ్మ, అయ్యలు గమనించట్లేదు కానీ 'రాజీ'లో వచ్చిన మార్పుకు చూసి మల్లమ్మకు గుబులు పట్టుకొంది.

మల్లమ్మ 'రాజి'ని దగ్గరికి పిలిచి వీపు నిమురుత్తూ ఏంది బిడ్డా! రోజు రోజుకు గట్లయిపోతున్నవు? మన యింటా వంటా లేని సదువు మీద గంత కోరికెట్ల బుట్టిందే నీకు? మన బతుకు తెల్సు గందా! మరెందుకంత కాయుషు పడుతున్నవ్ అనునయంగా అంది.

ఎన్నడూ లేనిది నాయినమ్మ అలా దగ్గరికి తీసుకొని అడిగేతలికి రాజికి కళ్ళల్లో నీళ్ళు తిరిగినయి.

మనం గూడా సదువ్కోవచ్చట. ఎవ్వరైనా గా బళ్లో సదువొచ్చంట. నువ్వు ఒప్పుకోయే నాయినమ్మా! ఇంకొంచెం పొద్దుగాల లేసి నీ పనులన్ని సేత్తా నీకే లోటు రాకుండ సూత్త. తమ్ముని కూడా నా తాన్నే ఉంచుకుని సదూకుంట బతిలాడుతున్న రాజిని చూసి ఆలోచనలో పడింది మల్లమ్మ.

''కాగల కార్యం గంధర్వులే తీర్చినట్టు ఇద్దరు ముగ్గురు పంతులమ్మలు కొంతమంది పిల్లల్ని వెంటేసుకొని గుడిసె గుడిసె తిరుగుతూ 'రాజి' ఉన్న దగ్గరికి వచ్చారు. అప్పుడప్పుడు కనబడే రాజిని చూసి పలకరింపుగా నవ్వారు. దానికే రాజి మనసు పులకించి పోయింది.

వాళ్ళను నాయినమ్మ మంచం దగ్గరికి తీసికెళ్ళింది. వాళ్ళు మల్లమ్మకు చదువు గొప్పతనం, విలువ చెప్పి, ఆ అదృష్టానికి 'రాజి'ని దూరం చెయ్యొద్దంటూ, చంటోడికీ అంగన్‌బడి ఉంటుందని అక్కడ మంచి పౌష్టికాహారం పెడతారని చెప్పారు. తనలా మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి లేకుండా మండలాఫీసులో దరఖాస్తు పెట్టించి మూడు చక్రాల బండి యిప్పిస్తామని, రాజిని తప్పక బడికి పంపియ్యమని మరీమరీ చెప్పి వెళ్ళారు.

మెత్తబడ్డ మల్లమ్మ తన మనవరాలి కోరిక తీరాలని మనసారా కోరుకుంది.

**కథలు, కవితల పోటీలలో ప్రచురణకి ఎంపికైన కవిత**

## ఆరోజు ........... ఈరోజు

– పి.జి.భవాని, ఎస్.జి.టి., తూర్పు గోదావరి జిల్లా

ఆ రోజు ఉయ్యాలలో పాపాయినై
అమ్మ ఒడిలో ఒదిగిపోయే జాబిలమ్మనై.
మా అన్నకేమో టాలెంట్ స్కూల్, నాకేమో గవర్నమెంట్ స్కూల్.
టాలెంట్ స్కూల్‌లో లాస్ట్‌ర్యాంక్ వాడిది,
గవర్నమెంట్ స్కూల్‌లో ఫస్ట్‌ర్యాంక్ నాది.
వాడికి చదువు హైరేంజ్‌లో
నాకు మ్యారేజ్ లోరేంజ్‌లో,
వాడికేమో నాన్న పెట్టే హౌసింగ్‌లోన్
నాకేమో అత్తారింట్లో ఇందిరమ్మలోన్.
నాన్న హస్తం వాడికి, అభయ హస్తం నాకు,
ఆస్తి హక్కు వాడికి, డ్వాక్రా అప్పు నాకు.
బ్యాంక్ మదుపు వాడికి,
డ్వాక్రా పొదుపు నాకు.
పెన్నే మరిచే గరిటె పట్టే,
వంటే నేర్చే, వంటింట్లోన కుందేలే అయ్యే!
కాలం కరిగే నా కళ్లముందే,
నా పాప ఎదిగే నా కళ్ళ ముందే.
కన్నోళ్ల ఆశలు తెంచే మా నాన్న
కన్నీళ్ళు తుడిచే భాధ్యత నాదన్న!
కాలం మారే నేను మారే,
పక్కింట్లోన ఈ తరం వనితతో స్నేహం కుదిరే.
ఇంట్లో రూపాయి కావాలన్న పతినే అడిగా,
పక్కింట్లో ఉపాయం కావాలన్న వనితనే అడిగా
పాప – బాబు తేడా కాదు, ఇద్దరు – ఇద్దరే ఎవరికి వారే!
ఈ రోజు కలెక్టర్ అయినా – కమీషనరైనా,
ఆడదేనమ్మా తెలుసుకోవమ్మా!
ఓపెన్ చదువుల బాటను పట్టే!
డిగ్రీ పట్టా చిటికెలో పట్టే.
రాజీవ్ ఉద్యోగ మేళాలోన మెలుకువలెన్నో తెలుసుకున్నా,
సమాజంలో మార్పు తేవాలన్న టీచర్‌గానే రావాలనుకున్నా.
అనుకున్నట్టుగా ట్రైనింగ్ అయ్యా,
డి.ఎస్సీలోన ర్యాంకే కొట్టా.
ఒడిలో గురువుగా అడుగే పెట్టా,
సమాజ మార్పుకు తొలిమెట్టే అయ్యా.
చదువుకు ఆటంకం వయసేకాదు,
ఆడా – మగా తేడా లేదు.
నాలా మీరు చూడాలంట,
అనుకున్న లక్ష్యమే చేరాలంట!

ఇక 'రాజి' సంతోషం చెప్పనలవి గావడం లేదు. లోకాన్ని జయించినంతగా ఉంది. నాయినమ్మ ఒప్పుకుంది. లేడి పిల్లలా ఇల్లంతా గంతులు, అక్కలు, అమ్మా, అయ్యా ఎప్పుడొస్తారా అని అటూ ఇటూ తిరగసాగింది. పంతులమ్మలు చెప్పిన యిషయాలన్నీ ఆళ్ళ చెవుల్లో ఎప్పుడెయ్యాలా అని ఆరాటంగా ఉంది రాజికి.

ఉన్నట్టుండి మబ్బులు కమ్ముకొచ్చి వర్షం పడేలా అయ్యింది వాతావరణం. హఠాత్తగా యిదేందో గిట్లవుతున్నదేటి, అనుకుంటూ బైట ఆరేసిన బట్టలు తీసింది. రేపటికి కట్టెలు తడిత్తే వంటకు కట్టం అనుకుంటూ కట్టెల మోపు తెచ్చి గుడిసె లోపల పెట్టింది.

పొద్దు గూకిన తర్వాత సేయాల్సిన పనులన్ని ముందే సేసుకొని పైన మబ్బుల్ని లోపలి ఆలోచనల్ని గమనించుకుంటూ గుడిసె బైట తచ్చాడ సాగింది 'రాజి'.

తోటకూర కాడల్లా వడలిపోయిన మొఖాల్తో, దిగులు మోఘాలు కమ్ముకున్న వాళ్ళందర్నీ చూసి ఏమైందో తెలియక కంగారు పడింది రాజి. తను అప్పటి దాకా ఎప్పుడెప్పుడు చెప్పాలా అని ఆరాటపడిన సంగతులన్ని ఆ చిన్ని గుండెలోనే దాచుకుంది.

ఆదుర్దాగా అడుగుతున్న మల్లమ్మతో 'ఇగ ఈ సోటుతో మనకి ఋణం తీరిపోయింది. గిది సర్కారోళ్ళ తలం గదా ఇక్కడేదో కడ్తరంట తెల్లారేసరికి ఖాళీ సేయకపోతే ఆళ్ళే వచ్చి గుడిసెలన్ని పీకెత్తరంట. 'మనం మరోసోటు ఎతుక్కోవాలె' అని మనోళ్ళందరితో మాట్లాడ్డానికి పోతున్నాం. అంటూ వెళ్తున్న అమ్మ అయ్యలను, అలాగే చూస్తుండి పోయింది రాజి. ☯

### అక్రమ బదిలీలు అడ్డుకున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక

కడప జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాట ఫలితంగా జిల్లాలో జరిగిన 37 అక్రమ బదిలీలకుగాను 22 అక్రమ బదిలీలు రద్దు చేశారు. మరో 15 అక్రమ బదిలీల రద్దుకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా సంచాలకులు, ప్రాంతీయ సంచాలకులకు సూచించారు. యుటియఫ్, ఏపిటిఎఫ్, హెచ్ఎంఎ, ఏపియుఎస్, పిఆర్‌టియు, ఏపిటిజి, ఆర్‌జెయుపి, ఎస్‌యుటిఏ, వైఎస్‌టిఎఫ్ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి అక్రమ బదిలీల రద్దుకు పోరాటం చేసినట్లు యుటియఫ్ నాయకులు బి.లక్ష్మిరాజా తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాలపై ఉద్యమించనున్నట్లు లక్ష్మిరాజా తెలిపారు.

### హుదూద్ తుఫాను బాధితులకు అండగా యుటియఫ్

ఉత్తరాంధ్రలో హుదూద్ తుఫాను ప్రభావంతో ఇండ్లు, పంటలు పోగొట్టుకున్న బాధితులకు అండగా యుటియఫ్ తనవంతు కృషి చేసింది. నివాసాలను కోల్పోయిన పేదలకు జిల్లాలో బొబ్బిలి డివిజన్ నాయకులు బృందాలుగా అక్టోబర్ 18,19,20 తేదీలలో 3 రోజుల పాటు విరాళాలను సేకరించారు. విరాళాల సేకరణలో రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరితోపాటు జిల్లా కార్యదర్శి పి.మధుసూదన రావు, బొబ్బిలి, రామభద్రపురం, సీతానగరం మండల మక్కువ, నాయకులు కె.రామకృష్ణ, వి.ప్రసన్నకుమార్, బాబూరావు, రాధాకృష్ణ, చంటి, గంగులు, జి.శ్రీనివాస్, సురేష్, రామకృష్ణ, జగదీష్‌లు బృందం గా పాల్గొన్నారు.

16వేల రూపాయల విరాళాలతో దుప్పట్లు, తువ్వాళ్లు, కంచాలు, పామాయిల్ ప్యాకెట్లు, ఇతర వస్తువులను 45 కుటుంబాలకు అంద జేశారు. బలిజిపేట మండలం నారాయణపురం గ్రామంలో ప్రాథమి కోన్నత పాఠశాలలో పునరావాసం గల 32 కుటుంబాలకు, విద్యార్థు లకు ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డెప్యూటీఈ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు యుటియఫ్ బృందం అందజేసింది. యుటియఫ్ చేసిన కృషిని డిఎస్‌పి అభినందించారు.

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు,
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
mail : ikyopadhyaya@gmail.com

ప్రశ్న : (ఎ) **మా పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా 10-12-2002న విధులలో చేరారు. స్టెపింగ్ అప్ ఆఫ్ పే కారణంగా అతని ఇంక్రిమెంట్ నవంబరుగా ఉన్నది. అతనికి 12 సం॥ల స్కేల్ ఏ తేదీ నుండి ఇవ్వాలి.**

(బి) **మా పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పని చేయుచున్న ఉపాధ్యాయులు ఎంఎ, టిపిటి, ఇఓ, జిఓ అర్హతలను కలిగి ఉన్నాడు. బిఇడి లేకపోయినా SPP-IA స్కేల్ ఇవ్వవచ్చునా?**

**- పి.చంద్రశేఖర్,** పశ్చిమగోదావరి జిల్లా

జవాబు:(ఎ) స్కూల్ అసిస్టెంట్‌గా విధులలో చేరిన తేదీ నుండి 12 సం॥ల సర్వీస్ పూర్తి అయిన తర్వాత 10-12-2014 నుండి (జీత నష్టపు సెలవు లేకపోతే) ఇవ్వవచ్చును.

(బి) ఇవ్వవచ్చును. జిఓ ఎంఎస్ నం.30 విద్య; తేది. 23-06-2010 (అ.ద. 27)

ప్రశ్న : **మా ప్రధానోపాధ్యాయులు అబార్షన్‌కు 2సార్లు మాత్రమే సెలవు వినియోగించుకోవచ్చు అంటున్నారు. సరియైన దేనా?**

**- వరలక్ష్మి,** నెల్లూరు జిల్లా

జవాబు :సరియైనది కాదు. జిఓ ఎంఎస్ నం.254 ఆర్థిక; తేది. 10.11.1995 ప్రకారం ఇద్దరుకంటే తక్కువ జీవించి వున్న బిడ్డలు కలవారు అర్హులు. అంతేకాని ఎన్నోసారి అనే దానితో నిమిత్తము లేదు.

ప్రశ్న : **నాకు మొదటిసారి ఒక బాబు, రెండవసారి కవల పిల్లలు మొత్తం ముగ్గురు పిల్లలు. ఎల్‌టిసిలో అందరూ ప్రయాణం చేయవచ్చా? అదే విధంగా ఐటిలో ముగ్గురి పిల్లల ట్యూషన్ ఫీజు సేవింగ్స్‌లో చూపించవచ్చా?**

**- డివిఎస్ఎన్ మూర్తి,** అన్నవరం

జవాబు :జిఓ ఎంఎస్ నం.140 ఆర్థిక; తేది.03.04.1996 ప్రకారం 01.04.1996 ముందు పుట్టిన పిల్లలు ఎంతమందైనా ఎల్‌టిసి వినియోగించుకోవచ్చు. 01.4.1996 తదుపరి జన్మించిన పిల్లల విషయంలో ఇద్దరికి మాత్రమే పరిమితం చేయబడింది. ఐటి విషయంలో ఇద్దరు పిల్లల ట్యూషన్ పీజు మాత్రమే సేవింగ్స్‌కు పరిగణించబడుతుంది.

ప్రశ్న : **నేను 10+2+3 ప్యాట్రన్‌లో ఇంటర్ చదవలేదు. డిగ్రీ దూర విద్య విధానం ద్వారా చదివితిని, బిఇడి రెగ్యులర్‌గా చేసితిని, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుని పోస్టుకు నేను అర్హురాలి నేనా?**

**- కళావతి,**

జవాబు :అర్హులు. ఫార్మల్ డిగ్రీ విషయంలో 10+2+3 నిబంధన వర్తించదు.

ప్రశ్న : **అర్థజీతపు, కమ్యూటెడ్, సరెండర్ సెలవు కాలంలో ఐఆర్ క్లైయిమ్ చేయవచ్చునా?**

**- బి.రత్న కిషోర్,** ఏలూరు

జవాబు :అర్థజీతపు సెలవు, కమ్యూటెడ్ సెలవు కాలంలో ఐఆర్ మంజూరు చేయబడుతుంది. సరెండర్ సెలవు కాలము నకు మంజూరు చేయబడదు.

ప్రశ్న : **నేను నా జూనియర్‌తో స్టెపింగ్ అప్ ఆఫ్ పే పొందాను. తదుపరి మరొక జూనియర్ 18 సం॥ల స్కేల్ పొంది పదోన్నతి పొంది నందున మరల స్టెప్‌అప్ చేసుకోవచ్చునా? మా ఎస్‌టిఓ అభ్యంతరం పెడుతున్నారు.**

**- ఏ.పూర్ణచంద్,** పెద్దపట్నంలంక

జవాబు :అభ్యంతరం సరైంది కాదు. స్టెప్‌అప్ ఒకసారే చేసుకోవాలనే నిబంధన ఏదీలేదు.

ప్రశ్న : **ఒక ఎస్‌జిటి 21.01.2002న ఉద్యోగంలో చేరి ప్రీపోన్మెంట్ కారణంగా అక్టోబర్‌లో ఇంక్రిమెంట్ కలిగి ఉన్నారు. 12 సం॥ల స్కేల్ అనంతరము వార్షిక ఇంక్రిమెంట్ ఎప్పుడు ఇవ్వాలి.**

**- పి.బెన్‌హర్,** తాళ్ళూరు, గుంటూరు జిల్లా

జవాబు :21.1.2014న 12 సం॥ల స్కేల్ మంజూరు చేస్తారు. 14050/-గా ఉన్న మూలవేతనము 14860/-గా నిర్ణయించ బడుతుంది. SPP-IA మంజూరు ఎఫ్ఆర్ 22 ఎ(i) ప్రకారం చేయబడుతుంది. ఎఫ్ఆర్ 31(2) ప్రకారం ఇంక్రిమెంట్ తేదీన వేతన పునఃస్థిరీకరణ జరగాలి. 2002లో చేరిన ఎస్‌జిటిలకు రెండు ఇంక్రిమెంట్లు కలిపి 14860/-గా నిర్ధారించబడినందున ఇంక్రిమెంట్ తేదీ అయిన అక్టోబర్ లో ఎఫ్ఆర్ 31(2) ప్రకారం వేతన పునఃస్థిరీకరణ వర్తిం చదు. అందుచేత జనవరి ఇంక్రిమెంట్‌గా ఉంటుంది.

ప్రశ్న : **నేను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నా భార్య మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్నారు. నా భార్యను మున్సిపాలిటీ నుండి జిల్లా పరిషత్‌కి బదిలీ చేయించుకోవడానికి అవసరమయ్యే ఉత్తర్వులు తెలుపగలరు.**

**- కె.వెంకట్**

జవాబు :ప్రస్తుతం అటువంటి ఉత్తర్వులు ఏవీలేవు.

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయిని 10.06.2014 నుండి 06.12.2014 వరకు ప్రసూతి సెలవులో వున్నారు. ఆమె ఇంక్రిమెంట్ అక్టోబర్ మాసంలో ఉన్నది. చేరిన తేదీ నుండి మాత్రమే ఇంక్రిమెంట్ మంజూరు చేయ బడుతుంది అంటున్నారు. వాస్తవమేనా?**

**- సౌజన్య,** ప్రకాశం జిల్లా

జవాబు :ఆర్థిక శాఖ లేఖ 853/ఎఫ్ఆర్-2/2012; తేది.22.1. 2013 ప్రకారము ఇంక్రిమెంట్ అక్టోబర్ 1వ తేదీ

నుండి మంజూ రు చేస్తూ ఆర్థిక లాభం విధులలో చేరిన తేదీ నుండి మంజూరు చేయబడుతుంది.

ప్రశ్న : **నా పుట్టిన తేదీ. 05.09.1958, నేను 29 సం॥ల 10 నెలల 20 రోజులు సర్వీస్ పూర్తి చేసిన అనంతరము వ్యక్తిగత కారణాలపై 31.05.2014 స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి యున్నాను. ఆ తేదీకి నా మూలవేతనము రూ.27700/-. నా సర్వీస్ పింఛను ఎంత?**

**- ఎస్.కృష్ణవేణి,** విజయనగరం జిల్లా

జవాబు :మీ వాస్తవ ఉద్యోగ విరమణ తేదీకి, స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తేదీకి మధ్యగల వ్యత్యాసము 2 సం॥ల 4 మాసములు వెయిటేజిగా నిర్ణయించి 32 సం॥ల 2 నెలల 20 రోజుల అర్హదాయక సర్వీస్‌గా నిర్ధారించి రూ. 27700 × 64 × 1/2 × 1/66 సూత్రం ప్రకారము రూ.13431/- సర్వీస్ పింఛనుగా లెక్కిస్తారు.

ప్రశ్న : **మేము ఎస్‌జిటిగా 9 సం॥ల సర్వీస్ చేసి ఎస్ఏగా పదోన్నతి పొంది 1.11.2002న విధులలో చేరాము. అదే సంవత్సరం డిఎస్‌సి 2002 ఉపాధ్యాయులు 17.10.2002న నేరుగా ఎస్ఏలుగా చేరియున్నారు. మాలో ఎవరు సీనియర్?**

**- పి.బిర్లానాయుడు,** చిత్తూరు జిల్లా

జవాబు :ప్రమోషన్లు, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఉపాధ్యాయుల సీనియార్టీ నిర్ణయించేటప్పుడు స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్‌రూల్స్ 33 & 34 ప్రకారము ముందుగా విధులలో చేరిన వారే సీనియర్. కావున 17.10.2002న చేరిన డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ ఉపాధ్యాయులే సీనియర్ అవుతారు.

ప్రశ్న : **రూ.398/-లపై వేతనముపై విధులలో చేరిన ఇరువురు ఉపాధ్యాయులలో సీనియర్ అయిన నేను తేది.07.12.1986న, జూనియర్ ఉపాధ్యాయుడు 27.03.1987న రెగ్యులర్ స్కేల్‌లో నియమించబడినాము. నేను 11.02. 2009న, జూనియర్ 29.6.2010న ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యా యులుగా పదోన్నతి పొందినాము. నా జూనియర్ వేతనము నాకన్నా ఎక్కువగా ఉన్నది. స్టెప్‌అప్ వర్తిస్తుందా?**

**- పి.నాగేశ్వరరావు,** జగ్గంపేట

జవాబు :మీరు వ్రాసిన వివరాల ప్రకారము స్టెప్‌అప్ వర్తిస్తుంది.

ప్రశ్న : **నేను స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇఓపిఆర్‌డిగా ఎంపిక కాబడి ఉన్నతాధికారుల అనుమతితో రిలీవ్ అయి క్రొత్త పోస్టులో చేరినాను. పాత పోస్టుకు సంబంధించిన పే ప్రొటక్షన్, ఇంక్రిమెంట్ తేదీ కొనసాగుతుందా?**

**- కిరణ్మయి,** నెల్లూరు జిల్లా

జవాబు :ఆర్థిక శాఖ మెమో నం.14497/188/ఎ/ఎఫ్ఆర్-2/2004 తేది.15.10.2004 ప్రకారము పాత పోస్టు యొక్క సర్వీస్‌కు, వేతనానికి రక్షణ ఉంటుంది. ఇంక్రిమెంట్ మాత్రము క్రొత్త పోస్టులో చేరిన తేదీ నుండి సంవత్సరం తర్వాతే మంజూరు చేయబడుతుంది.

ప్రశ్న : **మా పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థికి 6వ తరగతిలో పాఠశాలలో చేరినప్పుడు రికార్డుషీటు ప్రకారము పుట్టిన తేదీని అడ్మిషన్ రిజిష్టర్‌లో నమోదు చేశారు. ఇప్పుడు అతని తల్లిదండ్రులు జననమరణ రిజిష్టర్‌లో ఇచ్చిన ఒరిజినల్ సర్టిఫికెట్ తెచ్చి ఆ ప్రకారము ఎస్ఎస్‌సి నామినల్ రోల్స్ వ్రాసే సందర్భంలో మార్చమని అడుగుతున్నారు. మార్చవచ్చునా?**

**- కె.సుబ్బారావు,** తిరుపతి

జవాబు :మార్చవచ్చును. ఎస్ఎస్‌సి స్కీమ్‌నందలి సబ్సిడరీ రూల్ 6 ప్రకారము అడ్మిషన్ రిజిష్టర్‌లో పుట్టిన తేదీకి, జనన మరణ రిజిస్ట్రార్ యిచ్చిన పుట్టిన తేదీకి తేడా ఉన్నప్పుడు తనిఖీ అధికారి అనుమతితో మార్పు చేయవచ్చును.

ప్రశ్న : **నేను సర్వీస్ మొత్తం మీద 180 రోజులు కమ్యూటెడ్ సెలవు వాడుకున్నాను. 360 రోజులు నా అర్ధజీతపు సెలవు మినహా యించబడింది. ఇటీవల మా ప్రధానోపాధ్యాయులు 240 రోజులు మించి అర్ధజీతపు సెలవును కమ్యూటెడ్ సెలవుగా వాడుకోరాదు. ఇప్పటికే అదనంగా వాడుకొనిన సెలవు తాలుకు జీతము రికవరీ చేయాలి అంటున్నారు. సరియైనదేనా?**

**- పి.మధుసూదనాచారి,** విశాఖపట్నం

జవాబు :సరియైనది కాదు. ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనలు 1933 ప్రకారము సర్వీస్ మొత్తం మీద కమ్యూటెడ్ సెలవు 240 మించి (అనగా 480 రోజులు అర్ధ జీతపు సెలవులు) వాడుకోరాదు అని మాత్రమే ఉన్నది. అర్ధజీతపు సెలవుకు పరిమితిలేదు.

ప్రశ్న : **ఇన్-కం-టాక్స్ ప్రతినెల మినహాయించాలా? ఫిబ్రవరి జీతపు బిల్లులో మినహాయిస్తే సరిపోతుందా? ఎవరు చేయాలి?**

**- ఎన్.శ్రీకాంత్,** గుంటూరు జిల్లా

జవాబు :ఇన్-కం-టాక్స్ నిబంధనల ప్రకారము రాబోవు సంవత్సర కాలానికి ఆదాయపు పన్ను అంచనవేసి మార్చినెల జీతపు బిల్లుల నుండి ప్రారంభించి ప్రతినెల సమానంగా మినహాయిస్తే, ప్రతి క్వార్టర్‌కి రిటర్న్ ఆదాయపు పన్ను శాఖకి సమర్పించాలి. దీనికి పూర్తి బాధ్యత డిడిఓలదే.

ప్రశ్న : **ఒక ఉపాధ్యాయుడు నెల మధ్యలో చనిపోతే జిఐఎస్ చనిపోయిన నెలలో కూడా మినహాయించాలా? లేక ముందు నెల వరకు మినహాయిస్తే సరిపోతుందా.**

**- పి.శ్రీనివాస్,** విజయనగరం

జవాబు :చనిపోయిన నెలలో కూడా మినహాయించాలి.

## యుటియఫ్ & పిడియఫ్ ఎమ్మెల్సీల ముఖ్యమైన ప్రాతినిధ్యాలు

ఎయిడెడ్, గురుకుల సిబ్బందికి 60 ఏండ్ల రిటైర్ వయస్సు వర్తింపచేయాలని అనేక సార్లు ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ,విద్యాశాఖ న్యాయశాఖ, అధికారులతో ప్రాతినిధ్యాలు చేశాము. జూన్ 2వ తేదీ నుండి వీరికి వర్తింప చేయాలని చెప్పాము. ఆమేరకు వెనుకటి నుంచి అమలు చేయాలని కోరుతూ ఫైలు ఆర్థికశాఖ ఆమోదానికి పంపారు. అక్టోబర్ 30న హెల్త్‌కార్డుల ప్రారంభ సందర్భంలో వేదిక మీదున్న ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీరియస్‌గా జోక్యం చేసుకోవాలని గుర్తుచేశాము. అక్టోబర్ 31న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారికి పిడియఫ్ ఎమ్మెల్సీలు వి. బాలసుబ్రమణ్యం, కె.యస్. లక్ష్మణరావు, ఐ. వెంకటేశ్వ రరావు, పి. బాబురెడ్డి, గురుకుల సంఘాల నాయకులు మధుసూదన్‌రావు, మోహన్‌రాజ్, తదితరులు 60 ఏళ్ళ వర్తింపుపై ప్రాతినిధ్యం చేశారు. దీనిపై త్వరలో ఆర్డినెన్స్ విడుదల చేస్తామని సి.ఎస్. చెప్పారు. ప్రస్తుతం ఈ ఫైల్ ఆర్థికశాఖ ఆమోదానికి పంపారు. నవంబర్ 5వ తేదీన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి అజేయ కలాంతో మాట్లాడగా ఆర్థికశాఖ ఆమోదంతో వెంటనే ఫైల్ పంపిస్తామని చెప్పారు. తదుపరి ముఖ్యమంత్రి ఆమోదంతో ఆర్డినెన్స్ రూపొందించడం జరుగుతుంది.

## ఎయిడెడ్ ఉపాధ్యాయులకు అవసరమైన బడ్జెట్ రిలీజు చేయాలి

ఎయిడెడ్ పాఠశాలలకు మూడవ క్వార్టర్ బడ్జెట్‌గా రిలీజు చేసిన గ్రాంట్ 1,2 నెలలకు కూడా సరిపోదని అదనపుగ్రాంట్ రిలీజు చేయాలని ఆర్థికశాఖ కార్యదర్శి ఎల్.ప్రేమ్‌చంద్రారెడ్డి, పాఠశాల విద్య సిఏఓలతో ప్రాతినిధ్యం చేయడమైనది. ఆ మేరకు నాల్గవ క్వార్టర్ బడ్జెట్ నుండి వాడుకొనుటకు ఆర్థికశాఖ కార్యదర్శితో ప్రాతినిధ్యం చేయగా ఆ మేరకు అనుమతించారు. అయినప్పటికీ ఈ గ్రాంట్ చాలదని అవసరమైన అదనపు గ్రాంట్ కోసం ప్రతిపాదనలు ఆర్థికశాఖకు పంపాలని సిఇఓ గారికి విజ్ఞప్తి చేయగా ఆ మేరకు ప్రతిపాదనలు పంపారు. సంస్కృత పాఠశాలలకు విడుదల చేసిన గ్రాంట్ ఒక్క నెల జీతానికి కూడా సరిపోక పోవడంతో అదనపు బడ్జెట్ మంజూరు ప్రాతినిధ్యం చేశాము. జిల్లాలలో ఎయిడెడ్ ప్రైమరీ, సెకండరీ, సంస్కృత పాఠశాలలకు జీతం, అరియర్ల కు అవసరమైన బడ్జెట్ అంచనాల వివరలతో ప్రతిపాదనలు వెంటనే డిఎస్‌సికి పంపించాలని తెలియజేస్తున్నాము.

## 610 బదిలీల నుండి మినహాయింపు పొందినవారికి ప్రమోషన్లు యిప్పించాలి

610 జి.వో. అమలులో భాగంగా లోకల్, నాన్‌లోకల్ 70:30 నిష్పత్తిలో 2000 డి.ఎస్.సి.కి ముందు నియామకాలు కాబడిన వారిని బదిలీ నుంచి మినహాయింపునిస్తూ వారికి ప్రమోషన్లు ఇవ్వాలని పాఠశాల కమీషనర్‌కు మరొకసారి ప్రాతినిధ్యం చేయడమైదని. డి.ఎస్.సి. 2000 వరకు కొన్ని జిల్లాల్లో నాన్‌లోకల్ అభ్యర్థులకు ఓపెన్ కాంపిటీషన్ 30 శాతంలో నున్నవారిని నియామక ఉత్తర్వులిచ్చారు. అయితే 20%-30% మధ్య నియామకమైనవారు అప్పటి నిబంధన ఉత్తర్వుల ప్రకారం నియామకమైనందున బదిలీ నుండి మినహాయింపు నివ్వాలని కోర్టులను ఆశ్రయించారు. వీరికి హైకోర్టు ఆదేశాల మేరకు మినహాయింపునిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు యిచ్చియున్నది. ఈ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ ఉత్తర్వుల పరిధిలోనున్న వారి వివరాలు డి.ఇ.ఓ. నుండి సమాచారం రప్పించుకొనుటకు ఆదేశాలు యిస్తామన్నారు.

## ఎన్.ఓ.సిలు మంజూరు అధికారం డిఇఓలకు బదలాయించాలి

ఉపాధ్యాయుల పిల్లలు విదేశీ చదువులు, ఉద్యోగాలు కారణంగా అనేకమంది ఎన్.ఓ.సి.లకు దరఖాస్తు చేస్తున్నారని, అత్యవసర సంబంధిత సెలవు పెట్టి డైరెక్టరేట్‌కు వస్తున్నారని, ఎన్.ఓ.సి.ల మంజూరు అధికారం డి.ఇ.ఓలకు అప్పగించాలని పాఠశాల విద్య కమీషనర్ వి.ఉషారాణి గారికి విజ్ఞప్తి చేశాము. ఆమేరకు నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

## డిఎంఇలో మెడికల్ క్లయిమ్‌లు వెంటనే పరిష్కరించాలి

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కోఠిలో మెడికల్ క్లయమ్స్ వెంటనే పరిష్కరించి పాఠశాల విద్యాశాఖకు పంపించాలని డి.ఎమ్.ఇ. డైరెక్టర్ జి.కాంతారావు గారికి విజ్ఞప్తి చేశాము. దీనిపై స్పందిస్తూ డి.ఎమ్.ఇ.కి వచ్చిన తర్వాత 2 నెలల లోపలే క్లయిమ్స్ పరిశీలించి పంపుతామని డైరెక్టర్ తెలియజేశారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, పిఎఫ్

మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ఫైలు యూనిట్ ఆఫ్ అపాయింట్‌మెంట్ ఎలా ఉండాలనేదాని ఫైలు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుండి న్యాయశాఖకు సెప్టెంబర్ 2న పంపారు. దీనిపై న్యాయశాఖ కార్యదర్శి శ్రీహరిబాబుతో పలుమార్లు ప్రాతినిధ్యం చేశాము. మున్సిపల్ టీచర్లు పిఎఫ్ ఫైలు కొర్రిలతోనే నడుస్తుంది.

## పండిట్స్, పిఇటి అప్‌గ్రేడేషన్

పండిట్, పిఇటి అప్‌గ్రేడేషన్, రూల్స్ సవరణ ఫైల్ ఆర్థికశాఖ ఆమోదానికి పంపారు. ఫైనాన్స్‌లో బ్యాక్‌ఫైల్ కోసం కాలయాపన చేస్తున్నారు. వెంటనే ఆమోదం తెలపాలని ఆర్థికశాఖ కార్యదర్శికి విజ్ఞప్తి చేశాము. తెలుగు పండిట్స్ 409, హిందీ పండిట్స్ 1069, పిఇటిలు 1220, ఉర్దూ 1 అప్‌గ్రేడేషన్ కొరకు ఆర్థిక శాఖ అనుమతికి పంపారు.

## హుదూద్ తుఫాను మహావిధ్వంసం

200 కి.మీ. అసాధారణ వేగంత విరుచుకుబడిన తుఫాను విశాఖ తీరాన్ని దాటి నగరాన్ని, కొన్ని మండలాలను విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని కొన్ని మండలాలను అతలాకుతలం చేసింది. సుమారు 50మంది ప్రాణాలు కోల్పోగా, అపార ఆస్థి నష్టం జరిగింది. ఇంతటి మహావిపత్తును ఎదుర్కొవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలతో ప్రాణనష్టం తగ్గించగలిగారు. సహాయక కార్యక్రమాలు అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి అక్కడే తిష్టవేసి అధికార యంత్రాంగాన్ని కదిలించడం అభినందనీయం. బాధితుల సహాయార్థం దాతలు స్పందించారు. రాష్ట్ర జెఎసి జరిగిన నష్టానికి తమవంతు సహాయార్థంగా గతంకంటే భిన్నంగా రెండు బేసిక్ జీతాలు 125 కోట్లు ప్రకటించింది.

## విశాఖ, విజనగరంలో రాష్ట్ర అధ్యక్షులు పర్యటన

అక్టోబర్ 20వ తేదీన రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.జాజులు, వైఎఆర్‌కె ప్రసాద్ విశాఖ పట్నం జిల్లాలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలలో బైక్‌మీద పర్యటించి తుఫాను వలన నష్టపోయిన పలు పాఠశాలలను పరిశీలించారు. 21వ తేదీన విజయనగరం జిల్లా అధ్యక్షులు డి.రాము .... బోగాపురం, పూసపాటి రేట మండల కార్యకర్తలతో కలిసి పలు పాఠశాలలను దర్శించారు. పాఠశాల ఆవరణలో చెట్లు పాఠశాల భవనాలపై పడటం, బాత్‌రూమ్‌లు, ప్రహారీగోడలకు ఎక్కువ నష్టం జరిగింది. కూలిన చెట్లు తరలించుటకు రెండు వేల నుండి 10వేలు ఖర్చు అవుతుందని అంచనావేశారు. కొన్ని పాఠశాలల్లో సిన్‌టెక్స్ వాటర్ ట్యాంకులు నేలపైపడ్డాయి. తలుపులు ఊడిపోయి లేబరెటరీలు ధ్వంసం అయ్యాయి. కొన్ని భవనాలు బీటలు వారాయి. యుద్ధప్రాతి పదికన మరమత్తుల పనులు చేయించాలని అందుకు అవసరమైన నిధులు కేటాయించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.ఉషారాణి గారికి విజ్ఞప్తి చేయడమైనది.




# తిరుపతిలో విద్యాచైతన్య సదస్సు

దీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ నిత్యం ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేయడమే యుటియఫ్ ధ్యేయమని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నవంబర్ 2న తిరుపతి రామతులసి కల్యాణ మండపంలో ఎమ్మెల్సీ వై.శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన విద్యా సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన యున్న ఏకైక సంఘం యుటియఫ్ అని, ఆ స్ఫూర్తితోనే యుటియఫ్ అగ్రగామి సంఘంగా వెలుగొందుతోందని కొనియాడారు. ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ అడ్డగోలు నిర్ణయాల ఫలితంగా ప్రభుత్వ విద్యారంగం సంక్షోభంలో ఉందని, చైతన్యం కలిగిన ఉపాధ్యాయులుగా యుటియఫ్ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలే పేద ప్రజలకు విద్యాబుద్ధులు నేర్పుతున్నాయని, భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని అందుకని వాటి పరిరక్షణే ధ్యేయంగా పనిచేయాలని కోరారు.

యుటియఫ్ రాష్ట్ర నాయకులు సిహెచ్.సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న అడ్డగోలు ఉత్తర్వులను తక్షణం ఉప సంహరించుకోవాలని, పాఠశాలల పనివేళలు మార్చాలని, సర్దుబాటు ఉత్తర్వులని తక్షణం ఆపేయాలని, హెల్త్‌కార్డులపై యున్న ఆంక్షలు తొలగించి నగదు రహిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి ప్రసంగిస్తూ పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పిఇటి, భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడేషన్‌ను వెంటనే చేపట్టాలని, 398 జీతంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ప్రావిడెంట్ ఫండ్‌ను ఆన్‌లైన్ ఖాతాగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పుత్తూరు ఉపవిద్యాశాధికారి శేఖర్, ప్రభుత్వ లెక్చరర్ల సంఘం అధ్యక్షులు రవి, ఎన్‌జిఓ నాయకులు సురేంద్ర, డిగ్రీ లెక్చరర్ల సంఘం నాయకులు రామచంద్రారెడ్డి ప్రసంగించారు. వందలాది యుటియఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్న ఈ విద్యా సదస్సులో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోదండరెడ్డి, అధ్యక్షులు శ్రీరామ మూర్తి, ప్రధానకార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, సహాధ్యక్షులు వరలక్ష్మి, రమణయ్య, కార్యదర్శులు రవిప్రకాష్, ఎస్.ఎస్.నాయుడు, ముత్యాల రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నిర్మల, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతిలో యుటియఫ్ భవనం పై అంతస్తుల ప్రారంభోత్సవం

యుటియఫ్ సంఘ పక్షాన ఉపాధ్యాయుల కృషితో నిర్మించుకున్న యుటియఫ్ భవనంపై అంతస్తులను భవనాన్ని యుటియఫ్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి నవంబర్ 2న ప్రారంభించారు. తిరుపతి పెద్దకాపు లే అవుట్‌లో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో గెస్ట్ రూమ్‌లను ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, వై.శ్రీనివాసులురెడ్డిలు ప్రారంభిం చగా మినీ హాల్‌ను యుటియఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ ప్రధానసంపాదకులు సిహెచ్.సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటియఫ్ నాయకులు, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ యుటియఫ్ ఉపాధ్యాయుల పక్షాన చేస్తున్న పోరాటానికి నిదర్శనంగా ఉపాధ్యాయుల సహకారంతో ఇంత గొప్ప భవనాన్ని నిర్మించడం హర్షదాయకమని, భవిష్యత్తులో ఉపాధ్యాయులకు మరిన్ని సేవలందించడానికి ఈ భవనం ఒక వేదికగా మారాలని ఆకాంక్షించారు. ఈ భవనం వారధిగా ఉపాధ్యాయ వృత్తి ఔన్నత్యం చాటాలని కోరారు.

ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.శ్రీరామమూర్తి, ఎన్.సోమచంద్రా రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వరలక్ష్మి, నిర్మల, మునిరాములు, ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాయచోటిలో ఎమ్మెల్సీ గేయానంద్ పర్యటన

కడప జిల్లా రాయచోటి డివిజన్‌లోని చినమండెమ్, రాయచోటి మండలాలలోని పలు పాఠశాలలను ఎమ్మెల్సీ గేయానంద్, యుటియఫ్, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ప్రతినిధులతో కలిసి అక్టోబర్ 20న పర్యటించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. స్థానిక ఉర్దూ పాఠశాల స్థలం కొరకు తహసీల్దార్‌తో మాట్లాడారు. తర్వాత రాయచోటి డైట్ ప్రాంగణంలో జరుగుతున్న గణిత, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణా తరగతులలో ఉపాధ్యాయుల్ని ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కొత్తపల్లి ఉర్దూ ఉన్నత పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఎస్‌సి చైర్మన్‌తో మాట్లాడారు. ఎమ్మెల్సీ పర్యటనలో యుటియఫ్ జిల్లా కార్యదర్శులు ఎస్.జబీర్, కె.భూషణయ్య, మండల నాయకులు నరేంద్ర, రాజా రమేష్, రాజన్న, ఉమాశంకర్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఫయాజ్, సద్దామ్, సిఐటియు నాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.




# రాష్ట్ర మహిళా ఉపాధ్యాయుల సదస్సు

## మహిళా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానం

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 2న విజయవాడలోని మెగల్‌రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో మహిళా ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. సదస్సుకు యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి అధ్యక్షత వహించారు. అధ్యక్షోపన్యాసం చేస్తూ... విద్యారంగంలో పనిచేస్తున్న మహిళా టీచర్లు, విద్యార్థినుల సమస్యల పరిష్కారం, పాఠశాల విద్య సమగ్రాభివృద్ధికి దోహద పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేటికీ పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థినుల తీవ్ర ఇబ్బందులతోపాటు పలు ఆనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా ఉందని తెలిపారు. సుదీర్ఘ చర్చలు, పోరాటం తర్వాత హెల్త్‌కార్డు లు అమలులోకి వచ్చాయన్నారు. పీఆర్‌సీ అమలుకు వత్తిడి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మహిళా ఉపాధ్యాయుల సమస్యలు, పాఠశాలల్లో విద్యార్థినుల ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకు సుప్రీంకోర్టు ప్రత్యేక బృందంతో సర్వే చేయించిం దని, ఈ సర్వేలో ఎన్నో సమస్యలు వెలుగులోకొచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా టీచర్లకు రెండు సంవత్సరాల చైల్డ్‌కేర్ లీవ్‌ను అమలు చేయాలన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో ముఖ్యంగా విద్యార్థినులు చదువుకునే చోట మూత్రశాలలు లేకపోవడం దారుణమని, వెంటనే ప్రతి పాఠశాలలో వాటిని ఏర్పాటు చేయడంతోపాటు విద్యార్థినులకు ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావులు మాట్లాడుతూ మహిళా సదస్సులో చేసిన తీర్మానాలను చట్టసభల్లో ముఖ్యంగా శాసన మండలిలో పిడిఎఫ్ పక్షాన ప్రస్తావించి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ధనలక్ష్మి (శ్రీకాకుళం), సరోజిని (తూర్పుగోదావరి), నిర్మల (విజయనగరం), గాయత్రీ (కడప), రాజ సులోచన (ప్రకాశం), వినోద (గుంటూరు), కనకదుర్గ(పశ్చిమ గోదావరి), లీల (కృష్ణ), రంగమ్మ (కర్నూలు), మాధవిలత (నెల్లూరు)లు సదస్సులో ప్రసంగించారు.

ఈ కార్యక్రమానికి యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీదేవి, అరుణకుమారి, కనకదుర్గ, జయప్రభ, రమాదేవి, దమయంతి, నాగమణి, గాయత్రి, రమణమ్మ, ప్రేమమ్మ, మజుల, నవభారతి తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు కృష్ణా జిల్లా కార్యదర్శి పి.లీల ఆహ్వానం పలికారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులు శ్రీదేవి వందన సమర్పణ చేశారు. కృష్ణా జిల్లా బాధ్యులు కె.ఏ.ఉమామహేశ్వరరావు, సంజీవరెడ్డి, మనోహర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కృష్ణ జిల్లా ఎ.కొండూరు మండల కౌన్సిల్

యుటియఫ్ ఎ.కొండూరు మండల కౌన్సిల్ స్థానిక జెడ్‌పిహెచ్‌ఎస్ చీమలపాడునందు బాణోతు సూర్య అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ మహాసభలో యుటియఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉండటం వలన విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని ప్రభుత్వం వెంటనే డిఎస్‌సి-2014 నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. పీఆర్‌సీ నివేదిక వచ్చి నెలలు గడుస్తున్నా దానిని అమలుపరచడం లేదని, ఉద్యోగులకు 60% ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ నివేదికను జులై-2013 నుంచి అమలు చేయాలని కోరారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కెఏ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో త్వరలోనే పిఎఫ్ ఆన్‌లైన్ పూర్తవుతుందని దీని వెనుక యుటియఫ్ కృషి చాలా ఉందని తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరికి సీనియార్టీ లిస్టును తయారు చేయడం జరుగుతుం దని తెలిపారు.

ఎంపిపి శ్రీవాసం మునియం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. ఎంఇఓ ఎం.రాజశేఖర్ మాట్లాడు తూ యుటియఫ్ శాఖ పనితీరు చాలాబాగుందని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుటలో తాను ముందుంటానని తెలిపారు.

అనంతరం మండల ప్రధానకార్యదర్శి ఎ.సుందరయ్య కార్యదర్శి నివేదిక, కోశాధికారి జి.రామకృష్ణ, ఆర్థిక కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.పాల్‌బాబు రావు, జిల్లా కార్యదర్శులు డి.శ్రీనివాసరెడ్డి, పి.శోభన్ బాబు, మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.సూర్య, ఏ.సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మండల శాఖల కౌన్సిల్ సమావేశాలు

## గుంటూరు జిల్లా

### తుళ్ళూరు

అక్టోబర్ 10న బాపూజీ ప్రాథమిక పాఠశాలలో తుళ్ళూరు మండల శాఖ కౌన్సిల్ సమావేశం జరిగింది. 45మంది మహిళలతో కలిపి మొత్తం 96మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా కోశాధికారి ప్రేమ్‌కుమార్ యుటియఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కృష్ణ, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వర రావు పాల్గొని కార్యకర్తలను ఉత్తేజిత పరచడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడానికి, సమస్యల పరిష్కారంలోనూ యుటియఫ్ కార్యకర్తలు ముందుండాలని, సమాజంతో సత్సంబంధాలు కలిగియుండాలని పేర్కొన్నారు. తుళ్ళూరు మండల పరిషత్ అధ్యక్షులు వడ్లమూడి పద్మలత మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య అందించాలని, మెరుగైన విద్యా ప్రమాణాలతో జిల్లాలో తుళ్ళూరు మండలాన్ని అగ్రభాగాన నిలపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కుమార్ రాజా, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు రవిచంద్ర శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్, మండల నాయకులు సిహెచ్ సుబ్బారావు, పి.అరుణ్ కుమార్, ఎం.ఈశ్వర్‌నాథ్, భాస్కర్, కె.కరుణకుమారి, జె.రత్నజ్యోతిలు పాల్గొన్నారు.

### పెదకాకాని

గుంటూరు యుటియఫ్ జిల్లా కార్యాలయంలో అక్టోబర్ 22న జరిగిన పెదకాకాని మండల శాఖ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే, సమాజం కోసం కూడా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో 10వ పీఆర్‌సీ అమలు చేయాలని, ఆరోగ్యకార్డులు ఇవ్వాలని, పండిట్, పిఇటిలను అప్‌గ్రేడ్ చేయాలని తీర్మానించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. హనుమంత రావులు పాల్గొన్నారు. పి.ప్రేమకుమార్ ఎన్నికల పరిశీలకు లుగా వ్యవహరించారు.

## నెల్లూరు జిల్లా

### కొండాపురం

నెల్లూరు జిల్లా కొండాపురం మండల శాఖ మండల కౌన్సిల్ కొండాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనందు అక్టోబర్ 26న బి.మాధవరావు అధ్యక్షతన జరిగింది. మొదట ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నాగటి నారాయణ సతీమణి అమృత, హుదుద్ తుఫాను బాధితులకు, జిల్లాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎస్.శంకరయ్య కు సంతాపం ప్రకటించారు. అనంతరం ఉద్యమ చరిత్ర, సంఘ నిర్మాణం గురించి జిల్లా గౌరవాధ్యక్షులు పి. జానకిరామ్ చెప్పారు. 65మంది కార్యకర్తలు హాజరయ్యారు. జి.రాజేంద్రబాబు కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. కోశాధికారి పిఎన్ అనిల్‌కుమార్ ఆర్థిక నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ రెండు నివేదికలపై చర్చ ఆమోదం జరిగింది. నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి జివి చలపతి శర్మ, జిల్లా కార్యదర్శులు తులసీరాంబాబు,జి.వెంకటేశ్వర్లు వ్యహరించారు.

### విడవలూరు

ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా విడవలూరు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో అక్టోబర్ 19న ఎస్.మోహనరావు అధ్యక్షతన మండల కౌన్సిల్ జరిగింది. ముఖ్య అతిథులుగా యుటియఫ్ నెల్లూరు జిల్లా ప్రధానకార్యదర్శి కె.పరంధామయ్య, జిల్లా కార్యదర్శి ఎం.మస్తా నయ్య, జిల్లా కార్యదర్శి సుబ్బారావు, జిల్లా కోశాధికారి నాగిరెడ్డి, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్‌కె ఖాజావలీ పాల్గొన్నారు. పరంధా మయ్య మాట్లాడుతూ హెల్త్‌కార్డులకు ప్రీమియం వసూలు చేయడం సమంజసం కాదని, పీఆర్‌సీలో 60% ఫిట్‌మెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మస్తానయ్య మాట్లాడుతూ యుటియఫ్ ఉపాధ్యాయు లందరూ నిబద్ధతో పనిచేయాలని, సంఘ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సుబ్బారావు పరిశీలకునిగా నూతన మండల కమిటీ ఎన్నిక జరిగింది.

## పశ్చిమగోదావరి జిల్లా

### చింతలపూడి

అక్టోబర్ 25న చింతలపూడి మేదబడిలో మండల కౌన్సిల్ 56 మంది ప్రతినిధులతో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్‌సాబ్జీ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం కొలువు తీరిన తరువాత కూడా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోసం, ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.

పీఆర్‌సీ నివేదికను విడుదల చేసి 60% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి, రేషనలైజేషన్‌లో సెక్షన్‌ల వారీగా రోలును పరిగణించాలి, స్కూల్ పనివేళలు మార్చాలి, పండిట్స్, పిఇటి అప్‌గ్రేడేషన్, మున్సిపల్ టీచర్స్ సర్వీస్ రూల్స్ రూపొందించాలి, ఎయిడెడ్ ఉద్యోగుల పదవీ విరమణ 60 సం॥ల పెంపు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చింతలపూడి యుటియఫ్ మండలశాఖ నూతన కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, ఎన్నికల అధికారిగా జిల్లా కోశాధికారి పి.వి.నరసింహరావు వ్యవహరించారు.

## తూర్పుగోదావరి జిల్లా

### మామిడికుదురు

అక్టోబర్ 26న యుటియఫ్ మామిడికుదురు మండలశాఖ విద్యా సదస్సు నూతన కౌన్సిల్‌లో జిల్లాశాఖ అధ్యక్షులు జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ విద్యారంగంలో ఎదురౌతున్న సవాళ్ళను వివరిస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నా రు. పాఠశాలల పనివేళలు సవరించాలని, పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, 10వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని, సమగ్ర నిరంతర మూల్యాంకనా నికి అనుకూలంగా ఉపాధ్యాయులను సంసిద్ధపరచాలని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన నూతన కౌన్సిల్ సమావేశంలో మరో జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లా ఉద్యమాన్ని సమీక్షించి ఎన్నికలు నిర్వహించారు.

ఈ సమావేశంలో వై.నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ఎంపిడిఓ ఎం ధనలక్ష్మిదేవి, ఎంఇఓ పి.వి.వి.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.విశ్వనాథ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎం.రవీంద్రనాథ్, పి. శ్రీనివాస్, ఎం.ప్రకాష్, జి.సాయిబాబా హాజరై సందేశాలిచ్చారు.

# ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసనలు, ధర్నాలు

ఫ్యాప్టో ధర్నాలు రాష్ట్ర వ్యాపితంగా విజయవంతంగా జరిగాయి. ఉపాధ్యాయుల పట్ల విద్యారంగం పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఉపాధ్యాయుల్లో స్పందన బాగావచ్చింది. అయినా ప్రభుత్వం వైఖరిలో మార్పులేదు. సమస్యల్లో ఏలాంటి మార్పులేదు. ఈ దశలో నవంబర్ 5న ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం యుటియఫ్ కార్యాలయం హైదరాబాద్ లో చైర్మన్ కె.నరసింహారెడి అధ్యక్షతన జరిగినది. ఈ సమావేశంలో పాండురంగవరప్రసాద్, కో-చైర్మన్‌లు పి.బాబురెడ్డి, హృదయరాజ్ (సెక్రటరీ జనరల్), నారాయణరెడ్డి, రవిచంద్ర (డెప్యూటీ సెక్రటరీ జనరల్) మరియు జెఏసి సెక్రటరీ జనరల్ ఐ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో ధర్నాలు జరిగిన తీరును సమీక్షించి, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ వైఖరిని ఖండించారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగించాలని తీర్మానించారు. ఈ నవంబర్ 11వ తేదీన ప్రభుత్వానికి నోటీసు యిచ్చి, 19వ తేదీన హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహించాలని తీర్మానించారు. విద్యాశాఖ నిర్లక్ష్య వైఖరిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళాలని నిర్ణయించారు. రాష్ట్రస్థాయి ధర్నాకి ఎక్కువమందిని సమీకరించాలని పిలుపునిచ్చారు.

గతంలో యిచ్చిన సమస్యలతోపాటు మరికొన్ని సమస్యలపై వచ్చిన ప్రతిపాదనలు చర్చించి ఆమోదించి డిమాండ్స్‌లో చేర్చడమైనది. అవి...

1. డివిజన్ స్థాయిలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకి డిప్యూటీ డిఇఓ ఇన్‌చార్జ్ ఇవ్వాలి (మండల స్థాయిలో ఎంఇఓలాగా)
2. అన్ని ఉన్నత పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ని ఇవ్వాలి.
3. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పని సర్దుబాటులో (తాత్కాలిక రెగ్యులరైజేషన్) కదిలించరాదని, రాబోయే రేషనలైజేషన్‌లో ఆ పోస్టులు జిల్లాల్లోని అన్ని మండలాల్లో సమానంగా ఉండేలా పోస్టులు కేటాయించాలి.
4. 1990 తర్వాత చేరిన స్పెషల్ టీచర్ల ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింపచేయాలి.
5. ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు మండల, డివిజన్ స్థాయిలోనే చేయాలి.

పై సమస్యలతో కలిపి ధర్నా నోటీసు ప్రభుత్వానికి ఇవ్వాలని ఫ్యాప్టో కార్యవర్గం తీర్మానించింది.

### విజయనగరం జిల్లా

విజయనగరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో మహాధర్నా జయప్రదంగా జరిగింది. జిల్లా ఫ్యాప్టో బాధ్యులు ఎ.సదాశివరావు ధర్నా శిబిరాన్ని నిర్వహించారు. ప్రారంభ ఉపన్యాసం చేస్తూ ఐక్యకార్యాచరణను వివరించారు. అనంతరం యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి మాట్లాడుతూ ఈ జిల్లాకు మిలిటెంట్ ఐక్య ఉద్యమాలు నిర్వహించే చరిత్ర ఉందని, విజయాలు కూడా సాధించామని, ఇప్పుడు కూడా 11 సంఘాల పోరాటం ఫలిస్తుందని అన్నారు. భాషా పండితుల సమస్య టీచర్ల కొరత, మున్సిపల్, ఎయిడెడ్, పీఆర్‌సీ సమస్యలను ప్రస్తావించారు. సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం క్లస్టరు స్కూల్స్, రేషనలైజేషన్లు బాట పట్టిందని అన్నారు. ఏపిటిఎఫ్ (1938, 257) సంఘాల రాష్ట్ర కార్యదర్శులు బి.మోహనరావు, అన్వర్ భాషా, బి.జోగినాయుడు సమస్యలు పరిష్కారం అయేంతవరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్‌టియు నాయకులు సుదర్శనరావు, నారాయణరావులు ఎన్నికల ముందు ఇచ్చే హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్‌యుపిపి రాష్ట్ర జిల్లా నాయకులు పి.సత్యం, బి.గోవిందనాయుడు, వై.శ్రీనులు 11,12 జిఓలను సవరించి స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపిటిఎఫ్ (ఎం) నాయకులు బుకారి బాబు, మోహనరావు, జెసి రాజులు మాట్లాడుతూ ప్రైవేటీకరణ యత్నాలను విరమించుకోవాలన్నారు. యుటియఫ్ నాయకులు డి. రాము, కె.శేషగిరి, వర్మలు మాట్లాడుతూ క్లస్టర్ పాఠశాలల విధానాన్ని విరమించాలని, ఖాళీపోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు సన్యాసిరాజు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు డి.తిరుపతిరావు, ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం నాయకులు దుర్గారావు, పైడితల్లి, దేవానంద్, ఆప్టా నాయకులు బి.రాము తదితరులు ఫ్యాప్టో డిమాండ్లను పరిష్కరించి విద్యారంగాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

### తూర్పుగోదావరి జిల్లా

రాష్ట్రంలో దశాబ్దకాలంగా పెండింగ్‌లోనున్న పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయడంతోపాటు ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జెఏసి చైర్మన్ బూరిగ ఆశీర్వాదం డిమాండ్ చేశారు. అక్టోబర్ 29న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో జరిగిన ధర్నా శిబిరాన్ని ఆశీర్వాదం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 10వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, విద్య సంవత్సరం మధ్యలో క్రమబద్ధీకరణ పేరుతో ఉపాధ్యాయ బదిలీ చేయటం సరైన చర్యకాదని హెచ్చరించారు. తదుపరి ఫ్యాప్టో భాగస్వామ్య సంఘాల కన్వీనర్లు ప్రసంగించారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రభాకరవర్మ మాట్లాడుతున్న ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే సిబ్బందిని, ఉపాధ్యాయులకు 60 సం॥ల పదవీ విరమణ పెంపు చేయాలని, సెక్రటేరియేట్ నుండి చేసే దొడ్డిదారి బదిలీలు నిలుపుదల చేయాలని 2013లో బదిలీ కాబడి రిలీవ్ కాని ఉపాధ్యాయుల్ని రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌టియు, ఏపిటిఎఫ్ (257,1938), ఆర్‌యుపిపి, హెచ్‌ఎం అసోసియేషన్, పిఇటి సంఘాల నుండి బాధ్యులు ప్రసంగించారు. జిల్లా నలుమూలల నుండి 600మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ నుండి ప్రదర్శన నిర్వహించడమైనది.

### ప్రకాశం జిల్లా

రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు అక్టోబర్ 29న ఉపాధ్యాయ, పాఠశాలల సమస్యలపై కలెక్టర్ కార్యాలయం ఎదుట 'ధర్నా' నిర్వహించారు. ఈ ధర్నా శిబిరాన్ని యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరెడ్డి ప్రారంభిస్తూ రాష్ట్రంలో డివైఇఓ, ఎంఇఓ పోస్టులు సంవత్సరాల తరబడి భర్తీ కాకుండా ఉన్నాయన్నారు. పండితుల పోస్టుల అప్‌గ్రేడేషన్, ఎయిడెడ్ యాక్ట్ 37/2005, హెల్త్‌కార్డుల విషయం, పీఆర్‌సీ అమలులో ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు.

శాసనమండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలన్ని సమస్యల పరిష్కారం కోసం ఒక వేదిక మీదకు రావడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా ప్రైవేట్‌పరం చేయాలని ఎత్తుగడలు వేస్తున్నాయని, విధానపరమైన నిర్ణయాలు ఉపాధ్యాయ సంఘాలతో కానీ, ఎమ్మెల్సీలతోగానీ కనీసం సంప్రదింపులు జరపకుండానే నిర్ణయాలు చేయడం వల్ల విద్యారంగం అస్తవ్యస్తంగా తయారైనదని ఆవేదన తెలిపారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చైతన్యం చెందటం ద్వారా విద్యావ్యవస్థను పరిరక్షించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యల పరిష్కారం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు అగ్రబాగాన ఉన్నారన్నారు.

ఈ ధర్నా శిబిరానికి జిల్లా ప్రధానకార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆహ్వానం పలుకగా రాష్ట్ర ఫ్యాప్టో బాధ్యులు పి.వెంకట్రావు అధ్యక్షత వహించారు. జిల్లా ఫ్యాప్టో కమిటి ఏపిటిఎఫ్ (257), ఏపిటిఎఫ్ (1938), ఎస్‌టియు, పిఇటిఏ, హెచ్ఎంఏ, ఆర్‌యుపిపి, బిటిఏ, ఎస్‌సి, ఎస్‌టియుపి బాధ్యులు, అన్ని సంఘాల కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని 'ధర్నా'ను జయప్రదం చేయడం జరిగింది. ఈ ధర్నాకు యుటియఫ్ సంఘం నుండి సుమారు 400మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం జిల్లా ఫ్యాప్టో కమిటీ జాయింట్ కలెక్టర్‌కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. జిల్లాలో పదోన్నతుల ప్రక్రియ, రెగ్యులరై జేషన్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని కోరుతూ డిఇఓకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

## గుంటూరు జిల్లా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో అక్టోబర్ 29న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేపట్టింది. 11 ఉపాధ్యాయ సంఘాలు ఐక్యవేదికగా ఏర్పడి రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా ధర్నా చేపట్టారు. జిల్లా వ్యాపితంగా ఉపాధ్యాయులు పెద్దఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. ధర్నా అనంతరం ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఫ్యాప్టో స్టీరింగ్ కమిటీ జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండేకు మెమోరాండం అందజేశారు. ధర్నాలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై శాసనమండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం వివిధ శాఖల గురించి ప్రచార్భాటం తప్ప ఆచరణలో ఎటువంటి నిర్ణయాలు చేయట్లేదని, అటువంటి శాఖల్లో విద్యాశాఖ ముందు నిలుస్తుందని ఎద్దేవా చేశారు. విద్యాశాఖా మంత్రి చొరవ లేదని చెప్పటానికి డిఎస్‌సి వాయిదానే నిదర్శమన్నారు.

10వ వేతన సంఘం సిఫార్సులు అమలు చేయటానికి రూ. 12వేల కోట్లు అవసరం అవుతుందని, కానీ ఈ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. గత ఐదు సంవత్సరాల నుంచి పండిట్, పిఇటిల అప్‌గ్రేడేషన్ సమస్య అపరిష్కృతంగానే ఉందన్నారు. పాఠశాలల సమయం, ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు పెంపు, ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలు వంటి వివిధ సమస్యలపై విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో ఎన్నిసార్లు మాట్లాడినా ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుందని, ప్రభుత్వం మేల్కోటానికి ఉపాధ్యాయుల పోరాటమే మార్గమన్నారు. భవిష్యత్‌లో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే ఆందోళనల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని, శాసనమండలిలో కూడా పోరాడాతామని హామీ ఇచ్చారు.

ఫ్యాప్టో రాష్ట్ర కోశాధికారి బి.కరిముల్లా రావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను నూతన ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు జోసఫ్ సుధీర్ కుమార్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సమస్యలను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లామని, కానీ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవ కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రభుత్వం ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత మాత్రం సమస్యలు పరిష్కరించటంలో చిత్తశుద్ధిలేదన్నారు.

ధర్నా కార్యక్రమంలో ఫ్యాప్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు యం.హనుమంతరావు (యుటియఫ్), కె.బెన్‌హరబాబు (ఎస్టీయు), ఎస్‌డి చాంద్ భాషా (ఏపిటిఎఫ్ 257), జె.విజయ్‌చంద్ (ఏపిటిఎఫ్ 1938), బి.ప్రసాద్ (డిటిఎఫ్), టి.రవీంద్రబాబు (హెచ్ఎంఎ), యుటియఫ్ జిల్లా అధ్యక్షులు జి. ప్రభుదాస్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## అనంతపురం జిల్లా

అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అక్టోబర్ 29న ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా జరిగింది. ఈ ధర్నాలో హెచ్ఎం అసోసియేషన్ నాయకులు రమణారెడ్డి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఏపిటిఎఫ్ 257 రాష్ట్ర నాయకుడు ఎన్.రఘురామిరెడ్డి, ఏపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జయరామప్ప ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. యుటియఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.మహమ్మద్‌జిలాన్ ప్రభుత్వం కార్పొరేట్ రంగాన్ని రెడ్‌కార్పెట్‌వేసి ఆహ్వానిస్తున్నదని, దీనిని మనమందరము కలిసి ఎదుర్కొనలేకపోతే ప్రభుత్వ విద్యను, సమాజ సంక్షేమాన్ని నిర్వీర్యం చేసినవారమవుతామని, భవిష్యత్ తరాలకు ఏమి మిగల్చలేనివారమై దోషులుగా నిలబడాల్సి వస్తుందని తెలిపారు. హెచ్ఎం అసోసియేషన్ చలపతి, ఏపిటిఎఫ్ 257 నరసింహులు, ఎస్‌టియు రామన్న, ఏపిటిఎఫ్ 1938 వెంకట సుబ్బయ్య, ఎస్‌సి, ఎస్‌టి పెద్దన్న, పిఇటిఏ నాగరాజు, ఆర్‌యుపిపి ఎర్రిస్వామి, డిటిఎఫ్ సుభాన్, ఏపిపిటిఏ శంకరమూర్తి, సంఘీభావంగా పిఎస్‌హెచ్ఎం లక్ష్మినారాయణ, సిఐటియు రాంభూపాల్, వెంకట నాయుడు, గిరిజన ఉపాధ్యాయ సంఘం శివయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారిగారైన హేమసాగర్‌కు వినతి పత్రం సమర్పించడం జరిగింది.

## నెల్లూరు జిల్లా

నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. 600పైగా ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఫ్యాప్టో కో-కన్వీనర్ రమణ అధ్యక్షతన ధర్నా శిబిరం జరిగింది. యుటియఫ్, ఏపిటిఎఫ్ (1938), ఏపిటిఎఫ్ (257), డిటిఎఫ్, బిటిఏ, హెచ్ఎంఏ, పిఇటిఏ, ఆర్‌యుపిపి, ఎస్‌టియు తదితర సంఘాలు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. అధ్యక్షత వహించిన రమణ (డిటిఎఫ్) ఐక్య ఉద్యమాల విజయాలను, దీర్ఘకాలిక పోరాటాల ఆవశ్యకతను వివరించారు. యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.పరంధామయ్య మాట్లాడుతూ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలనిఇ, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ వెంటనే చేయాలని, ఎయిడెడ్ టీచర్ల రిటైర్మెంట్ 60 సం॥ల పెంపుదల ఉత్తర్వులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో అనేక విజయాలు, సౌకర్యాలు ఉపాధ్యాయులకు సాధించి పెట్టిందని తెలిపారు.

